# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## కుండపోత... నీట మునిగిన వరి నాట్లు



అరవపాలెంలో పూర్తిగా నీటమునిగిన వరి నాట్లు

చిట్టమూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త : చిట్టమూరు మండల వ్యాప్తంగా ఫెంగల్ తుపాను కారణంగా కుండపోత వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత మూడురోజులుగా నాయుడుపేట, చిట్టమూరు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. చిట్టమూరు మండలంలోని 23 పంచాయతీల్లో ఇప్పటికే రబీ సీజన్‌లో వ్యవసాయ పనులు 80 శాతం పూర్తి చేసుకున్న రైతాంగం ఫెంగల్ తుపాను వలన రైతులకు పెద్ద నష్టం వాటిల్లనప్పటికీ కొన్ని పంచాయతీలు పంటలు పూర్తిగా నీట మునిగాయి. వ్యవసాయశాఖ అధికారులు అందించిన సమాచారం ప్రకారం చిట్టమూరు మండలంలో 920 హెక్టార్ల మేరకు వరి పంట నీట మునిగినట్లు అంచనా వేస్తున్నారు. మరో రెండురోజులు వర్షాలు కొనసాగితే వరి నాట్లు పూర్తిగా దెబ్బతినే అవకాశం లేకపోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే యాకసిరి చెరువుకు గండి పడగా, మరికొన్ని ప్రాంతాల్లో పంట కాలువలు పొంగి ప్రవహించడం ద్వారా పలు పంట పొలాలకు గండ్లు ఏర్పడ్డాయి. అలాగే నార్త్‌వరత్తూరు, మెట్టు, చిట్టమూరు, మన్నెమాల, ఈశ్వరవాక తదితర ప్రాంతాల్లోని చెరువు లోతట్టులో వేసిన వరి పూర్తిగా నీట మునిగి నష్టం వాటిల్లిందని ఆయా గ్రామాల రైతులు చెప్పున్నారు. ఏదిఏమైనా ఫెంగల్ తుపాను ప్రభావం నాయుడుపేట, చిట్టమూరు మండలాలకు మరో మూడురోజులు వర్షాలు కొనసాగితే అన్నదాతలు పూర్తిగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని రెండు మండలాల ప్రజలు చెప్పున్నారు.

## మద్యం షాపు వ్యాపారుల్లో... పరేషాన్!

**-ఎంఆర్‌పి ధరపై కాకుండా... ఇష్యు ధరపై కమీషన్ చెల్లిస్తున్న ప్రభుత్వం -రోజుకు రూ.30-35 వేలు ఆదాయం వస్తే గిట్టుబాటు -మద్యం దుకాణాల్లో అంతగా జరుగని వ్యాపారం**



చిత్తూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రైవేటు మద్యం షాపులు అనే సరికి ఎగబడి మద్యం దుకాణాలను కైవసం చేసుకున్న మద్యం దుకాణదారులు ప్రస్తుతం వస్తున్న లాభ నష్టాలను బేరిజు వేసుకుని పరేషాన్ చెందుతున్నారు. మద్యం దుకాణాలు చేజిక్కించుకున్న వ్యాపారులకు రోజుకు 30 వేల నుండి 35 వేల రూపాయలు ఆదాయం వస్తేనే వారికి గిట్టుబాటు అవుతుంది. జిల్లాలో కొన్ని చోట్ల ఈ మేరకు మద్యం వ్యాపారం జరుగకపోవడంతో మద్యం షాపులు చేజిక్కించుకోవడానికి తాము పోటీ పడి భారీగా నష్టపోతున్నామని వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నెలలో నూతన మద్యం విధానంను అమలులోకి తీసుకువచ్చింది. గత ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహిస్తే ప్రస్తుత ప్రభుత్వం పాత విధానంకు చెల్లుచీటి పలికి కొత్త ఎక్సైజ్ విధానం అమలులోకి తీసుకువచ్చింది. కొత్త ఎక్సైజ్ విధానం ప్రకారం రెండేళ్ళ పాటు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో మద్యం దుకాణాలు వుంటాయి. మద్యం దుకాణాలు కైవసం చేసుకున్న వ్యాపారులు ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజు, బ్యాంకు ష్యురిటీ చెల్లించి మద్యం వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించింది. మద్యం షాపులను ఎలాగైనా దక్కించుకుంటే రెండేళ్ళలో భారీ ఆదాయం పొందవచ్చునని భావించి అప్పులు చేసి లాటరీ విధానంలో మద్యం షాపులు దక్కించుకున్న మద్యం దుకాణ యాజమానులు ప్రస్తుతం షాపుల నుండి లభిస్తున్న ఆదాయ, వ్యయాలు లెక్క వేసుకుని నోరెళ్ళబెడుతున్నారు. జిల్లాలో మొత్తం 104 మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేస్తే కొన్ని నియోజకవర్గాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో మద్యం షాపులను కైవసం చేసుకోవడానికి మద్యం దుకాణ వ్యాపారులు భారీగా పోటీ పడ్డారు. లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న మద్యం దుకాణ వ్యాపారులు తమను అదృష్ట దేవత వరించిందని, ఈ రెండేళ్ళ పాటు భారీగా డబ్బులను ఆర్జించుకోవచ్చునని సంబరపడ్డారు. ప్రైవేటు మద్యం షాపులు కావడంతో ఒకొక్క మద్యం షాపు యాజమానికి కొత్తగా ప్రారంభించిన మద్యం దుకాణానికి రూ.15 నుండి రూ.20 లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వం మద్య షాపుల ఏర్పాటు కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌లో మద్యం షాపు కేటాయించబడిన వ్యాపారుడికి 20శాతం మేరకు లాభం వుంటుందని పేర్కొనడంతో ఈ మేరకు లెక్కలు వేసుకున్న వ్యాపారులు ఎగబడి మద్యం షాపులను కైవసం చేసుకోవడానికి పోటీ పడ్డారు. షాపులు దక్కించుకున్న అనంతరం ప్రభుత్వం జారీ చేసి నోటిఫికేషన్‌లో మద్యం ఇష్యు ధరపై 20 శాతం లాభం ఇస్తామని పేర్కొనడం జరిగిందని, మద్యం ఎంఆర్‌పి ధరలపై కాదని స్పష్టం చేసింది. మద్యం ఇష్యు ధరపై ప్రభుత్వం మళ్ళీ పన్నులు, ఇతర వసూళ్ళు చేస్తుండటంతో మద్యం దుకాణదారులకు 10 నుండి 12 శాతం ఆదాయం మాత్రమే ప్రస్తుతం లభిస్తోంది. ఈ లెక్కన రోజుకు ఒక మద్యం షాపులో 3 లక్షల రూపాయల వరకు వ్యాపారం జరిగితే ఆ వ్యాపారికి రోజుకు 30-35 వేల రూపాయల వరకు ఆదాయం లభిస్తుంది. ఒక మద్యం షాపుకు రోజుకు 30 వేల ఆదాయం లభిస్తే నెలకు రూ.9 లక్షలు లభిస్తుంది. అంటే 2 నెలలకు రూ.18 లక్షల ఆదాయం వుంటుంది. ఇందులో ప్రభుత్వానికి 2 నెలలకు ఒకసారి 11 లక్షల లైసెన్సు ఫీజు చెల్లించాల్సి వుంటుంది. ప్రైవేటు మద్యం షాపులు కావడంతో షాపుల అద్దె, పోలీసు, ఎక్సైజ్ అధికారులకు మామూళ్ళు, మద్యం దుకాణ నిర్వహణ ఖర్చులు, మద్యం షాపుల విధులు నిర్వర్తించే సిబ్బందికి జీతభత్యాలు తదితరాలు చెల్లించాల్సి వుంటుంది. మద్యం దుకాణ షాపు అద్దె నెలకు రూ.15 నుండి రూ.20 వేలు అవుతుంది. ఈ ఖర్చులు మొత్తం రెండు నెలలకు లెక్కవేస్తే రూ.2.30 లక్షలు అవుతుంది. అంటే మద్యం షాపు యాజమానికి రెండు నెలలకు రూ.4.70 లక్షలు మిగులుతుంది. మరోవైపు ప్రభుత్వానికి చెల్లించే లైసెన్సు ఫీజు, షాపు నిర్వహణకు పెట్టిన పెట్టుబడి 25 లక్షల రూపాయల వరకు అవుతుంది. ఈ 25 లక్షల రూపాయలకు నెలకు రూ.2 వడ్డీ కింద చెల్లించినా రెండు నెలలకు ఒక లక్ష రూపాయల వరకు వడ్డీ అవుతుంది. అంటే మద్యం షాపు యాజమానికి రెండు నెలలకు మొత్తం ఖర్చులు మినహాయించి 3.70 లక్షల రూపాయల వరకు మిగిలే అవకాశాలు వున్నాయి. ఒక మద్యం షాపులో ఒక్కరే యాజమాని అయితే అతనికి లాభమే. అయితే ఒకొక్క మద్యం షాపును ఐదు నుండి ఆరు మంది భాగస్వాములుగా వుండటంతో వారి లాభాలు లెక్కవేసుకుంటే రెండు నెలలకు కలిపి 30 నుండి 40 వేల రూపాయలు మాత్రమే లభించే అవకాశం కన్పిస్తోంది. ఇదందా ఒక రోజుకు రూ.3 లక్షల వరకు వ్యాపారం జరిగే షాపు వుంటేనే దానికంటే తక్కువ ఆదాయం వున్న మద్యం షాపు అయితే మద్యం షాపు యాజమాని నష్టాల ఊబిలో చిక్కుకొని విలవిలలాడాల్సిన పరిస్థితి వుంటుంది.

## గజ వాహనంపై...మోహినీ అవతారంలో పద్మావతీ దేవి



గజ వాహనంపై అమ్మవారి ఊరేగింపు

తిరుచానూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త: గజవాహనంపై శ్రీ మహాలక్ష్మి తిరువీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాలలో ఐదవరోజు అమ్మవారికి ప్రీతి పాత్రమైన గజవానంపై ఊరేగారు. ఈ సందర్భంగా సుప్రభాతంతో అమ్మవారిని మేలుకొలిపి సహస్ర నామార్చన, నిత్యార్చన నిర్వహించారు. తరవాత ఆలయ ముఖ మండపం వద్ద స్నపనతిరుమంజనం శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవర్లను వాహన మండపంకు వేంచేపు చేసి వజ్ర, వైడూర్య, మణి, మాణిక్యాలతో, పుష్పాలతో సుందరంగ అలంకరించి గజవాహనంపై కొలువు దీర్చారు. తిరువీధులలో గజరాజులు గంభీరంగా అడుగులు వేస్తుండగా దేదీప్యమైన దీపకాంతుల నడుమ గజ వాహనంపై లోకమాత భక్తులను అనుగ్రహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అడుగడుగనా కర్పూర నీరాజనాలతో అ తల్లి కృపాకటాక్షాలకు పాత్రులైనారు. అంతక ముందుగా ఉదయం పద్మావతి అమ్మవారు మోహినీ అవతారంలో పల్లకి వహనంలో తిరువీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్యామల రావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు బాబు స్వామి, ఏవియస్ఓ సతీష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన మద్యం వద్దు... విద్య ముద్దు

**-ముగిసిన సీపీఎం జిల్లా మహాసభలు**



మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సత్యవేడు, డిసెంబరు 2 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మద్యం అవసరం లేదు నాణ్యమైన విద్య కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి సూచించారు. వెనుకబడ్డ రాయలసీమ జిల్లాలకు నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సత్యవేడులో జరుగుతున్న 14వ సీపీఎం జిల్లా మహాసభలు సోమవారంతో ముగిశాయి. ముగింపు సభలకు ముఖ్య అతిథిగా డి.రమాదేవి హాజరయ్యారు. అదాని సోలార్ విద్యుత్ కుంభకోణంపై దేశ వ్యాప్తం చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఈ భారం అందరిపైనా పడుతుందని తెలిపారు. విద్య ప్రైవేటీకరణలో భాగంగా జగన్ బ్రిటన్‌తో జగన్ చేసుకున్న సాల్ట్ ఒప్పందాన్ని కొనసాగించకుండా చంద్రబాబు రద్దు చేయాలన్నారు. నాణ్యమైన మద్యం ఇస్తామంటున్న చంద్రబాబు నాణ్యమైన విద్యనెందుకు ఇవ్వలేకున్నారని ప్రశ్నించారు. ఆధ్యాత్మిక నగరి తిరుపతిని వాటికన్ సిటీగా తీర్చిదిద్దుతామన్న పాలకులు వెంకన్న చెంత మద్యపుటేర్లు పారిస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం తిరుపతిజిల్లా సమగ్రాభివృద్ధికి అవసరమైన 28 అంశాలతో కూడిన తీర్మాణాలను మహాసభల ద్వారా ఆమోదించారు. తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంతో ప్రారంభించిన సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టు పనులు అటవీ అనుమతులు, నిధుల లేమి, పరిహార వివాదాల కారణంగా గత పదేళ్లుగా నత్తను తలపిస్తున్నాయి. కాలువ పనులు పూర్తయితే వెంకటగిరి, రాపూరు, ఢక్కిలి, శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల్లోని లక్షల ఎకరాలకు సాగునీరు, 150 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. 15 మంది సభ్యులతో కూడిన జిల్లా కూటమిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు రమేష్, గంధం మణి, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శిగా వందవాసి నాగరాజు, తిరుపతి జిల్లా సీపీఎం కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, టి.సుబ్రహ్మణ్యం, దాసరి జనార్ధన్, కమిటీ సభ్యులుగా భగత్, సాయిలక్ష్మి, జయచంద్ర, మాధవ్, ఆర్.వెంకటేష్, హరినాథ్, వేణుగోపాల్, బి.రవి, లక్ష్మి, జోగి రవికుమార్‌లు ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రమాదేవి, మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్యలు వ్యవహరించారు.

**అలరించిన డప్పు ప్రదర్శనలు :**

జిల్లా మహాసభలసందర్భంగా ప్రజా నాట్యమండలి, జానపద వృత్తి కళాకారులు చేపట్టిన ప్రదర్శనలు అలరించాయి. డప్పుల దరువులతో, ఉద్యమ పాటలతో పాలక ప్రభుత్వాల వైఫల్యాన్ని ఎండగట్టారు.

## ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం

**-రెండు వారాలకు ఒకసారి ఒక నియోజకవర్గ కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక - తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్**



సత్యసాయి కల్యాణ మండపం ప్రజావేదికలో కలెక్టర్

సూళ్లూరుపేట, డిసెంబర్ 2 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ వెల్లడించారు. సోమవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలు ఆయన స్వీకరించి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా వాటికి సంబంధించి కంప్యూటర్‌లో నమోదు చేసిన అనంతరం అర్జీదారులకు రసీదులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఏర్పడిన తర్వాత ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలో పరిష్కార వేదికను ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కాగా, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి తదితర ప్రాంతాల నుంచి తిరుపతికి రావాలంటే ప్రజలు మూడు గంటలు శ్రమించి వ్యయప్రయాసల కోర్చి రావాల్సి వస్తుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రెండు వారాలకు ఒకసారి ఒక నియోజకవర్గ కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందుగా ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట నియోజకవర్గంలో శ్రీకారంచుట్టామని తెలిపారు. ప్రస్తుతం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా 175 సమస్యలపై అర్జీలు వచ్చాయని తెలిపారు. ఇందులో అధిక భాగం రెవెన్యూ సమస్యలు సూళ్లూరుపేట మున్సిపాలిటీకి సంబంధించి రోడ్లు, డ్రైనేజిలు, మంచినీరు, కలుషిత నీరు తదితర అంశాలపై ప్రజల నుంచి తమకు అర్జీలు అందాయని తెలిపారు. వీటిని పరిశీలించి తగు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

**ఫెంగల్ తుపాను బాధితులను ఆదుకుంటాం :**

తిరుపతి జిల్లాలో ఫెంగల్ తుపాను బారిన పడి నష్టపోయిన రైతులను, ప్రజలను ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. పట్టణంలోని రోడ్లు, గ్రామీణ రోడ్లు, చెరువు కట్టలు కోతకు గురికావడం, పంటనష్టం తదితర అంశాలపై ప్రత్యేక బృందాల ద్వారా అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపి అనంతరం చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్మయి, తహశీల్దార్ ఎస్‌వి నరసింహారావు, కమిషనర్ కె.చిన్నయ్య, సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పంట నష్టం పరిశీలించిన జిల్లా కలెక్టర్ :**

ఫెంగల్ తుపాను ప్రభావంతో సూళ్లూరుపేట మండలంలో పంట నష్టపోయిన రైతులతో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడారు. సోమవారం సూళ్లూరుపేటకు వచ్చిన ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం పడమటికండ్రిగ, వట్రపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నీట మునిగి ఉన్న పంటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ పంటనష్టంపై సమగ్ర నివేదిక తెప్పించుకొని ప్రభుత్వానికి నివేదిక అందించిన అనంతరం తగిన సహాయం అందేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సూళ్లూరుపేట పట్టణంలో దెబ్బతిన్న రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్మయి, తహశీల్దార్ ఎస్‌వి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## భోళాశంకరా... అభివృద్ధి పనులకు ఆటంకాలేంటి!

**-శ్రీకాళహస్తీశ్వరాలయంలో టెండర్లు ఫుల్... పనుల నిర్వహణ నిల్**

*శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన భక్తులు అతిధులు సౌకర్యాల కల్పనకు లక్షలు విరాళాలు ఇస్తున్నారు. బూడిదీశుని ఆదాయం రూ.200కోట్లు దాటింది. ఇక్కడ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు పోలో మని టెండర్లు పిలుస్తున్నారు .కానీ ఏ కారణాలో ఏమో పనులు జరగటం లేదు.కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచి కూడా పనులు ప్రారంభించటం లేదు. ఇక గతంలో చేపట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదు. నిత్యం సంస్కరణలకు సంబంధించి ప్రకటించే శాసనసభ్యులు పనులు ఎందుకు ప్రారంభం కాలేదనే అంశాన్ని పరిశీలించి పరుగులు తీయించాల్సి ఉంది.*



శ్రీకాళహస్తి,డిసెంబర్ 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంను సర్వాంగ సుందరంగా తీర్చి దద్దుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. టెండర్లు పూర్తి అయి నెలలు గడుస్తున్నా ఎందుకు ప్రారంభం కాలేదో పాలకులకే ఎరుక. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పట్టణానికి కాకుండా స్వర్ణముఖి తీరాన్నే ఆలయానికి చేరే విధంగా 2016లో అప్పటి తెలుగుదేశం ధర్మకర్తల మండలి 'శివం టు శివం' రోడ్డును రూపకల్పన చేసారు. దుర్గాంబకొండ పక్కనే కొంత వరకు కచ్చారోడ్డు కూడా నిర్మించారు. తరువాత వచ్చిన ధర్మకర్తల మండలి ఆ అంచనాలను పక్కన పెట్టి కొత్త అంచనాలను తయారు చేసారు. ఎన్నికల నోటిఫికేషన్ ముందు టెండర్లు పిలిచారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చి ఆర్నెల్లు కావస్తున్నా, శివం టు శివం రోడ్డు పనులకు సంబంధించి ఎందుకు జాప్యం జరుగుతుందో పరిశీలించాల్సి ఉంది. ఇది రూ.28 కోట్లుతో చేపట్టిన పనులు ఈ పనులు ప్రారంభానికి ఆర్అండ్‌బి అధికారులు చర్చించాల్సి ఉంది. మరో భారీ ప్రాజెక్టు గిరిప్రదక్షిణలో కొంత భాగం మట్టి రోడ్డు ఉంది. వేయి లింగాల కోన నుంచి తుఫాన్ సెంటర్ వరకు రూ.8 కోట్లతో టెండర్లు పిలిచారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. ఇక దుర్గమ్మ కొండపై చక్కగా వెడల్పు చేయటానికి రూ.3.2కోట్లతో అంచనాలు తయార య్యాయి. ఇవి కాకుండా మరో 14 పనులు రూ.కోటితో టెండర్లు పిలిచారు. ఇందులో 4వ గేటు వద్ద కౌంటర్లు ఏర్పాటు అతిథి గృహాల్లో గీజర్లు, ఎసిలు,ఇతర సదుపాయాల కల్పనకు టెండర్లు పిలిచారు. ఇక ఏడుగంగమ్మల ఆలయం వద్ద రూ.35లక్షలతో పనులు చేపట్టారు. పనస కోనలో అమ్మవారి ఆలయాన్ని రూ.32లక్షలతో, గోశాల వద్ద డ్రైయిన్ రూ.27లక్షలతో టెండర్లు పిలిచారు. మరి ఈ పనుల ప్రారంభానికి అడ్డంకి ఏమో? భోళాశంకరునికే తెలియాలి!

## వర్షంతో... జన జీవనం అస్థవ్యస్థం





కాజ్‌వేలపై ప్రవహిస్తున్న వరదనీరు, బ్రాహ్మణాతాంగేల్‌లో ఊరుస్తున్న పక్కాగృహాలు

నారాయణవనం, డిసెంబర్ 2 ప్రభాతవార్త : బంగాళాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్‌తో గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నది. పగలు రాత్రి అనే తేడా లేకుండా వర్షం కురవడంతో జన జీవనం పరిస్థితి అస్థవ్యస్థంగా మారింది. కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులకు నీరు చేరుతున్నది. ఈ ఏడాది వర్షాలు అనుకున్న ంతగా కురవదని భావించిన రైతన్నల కళ్లలో ఆనందం వికసిస్తోంది. రైతులు ఆనందం వ్యక్త పరుస్తున్న ప్పటికి కురుస్తున్న వర్షంతో మూగజీవులకు సైతం మేత లేకుండా అల్లాడి పోతున్నది. ప్రధానంగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గ్రామీణా ప్రాంతాలకు వెళ్లే రోడ్లన్ని బురదగుంటగా మారిపోయింది. ఇకపోతే తిరువట్యం, సముదాయం, తుంబూరు, పాల మంగళం కాజ్‌వేలపై నీరు ప్రవహించడంతో రాకపోకలు ఆగిపోయింది. మండల స్థాయి అధికారులు తహశీల్దారు జయరాములు, ఎంపిడిఓ గుణశేఖర్, ఎస్ఐ రాజశేఖర్ తమతమ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. దీమండలంలోని భీమునిచెరువు, కశింమిట్ట , బ్రాహ్మణాతాంగేల్, దిగువకనకపాలెం, కశింమిట్ట ఎఎడబ్లు, యానాధికాలనీలు, ఎరికంబట్టు, నాగిలేరు, తిరువట్యంలో పక్కా గృహాలు ఊరుస్తున్నది. మండల, జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## ఫెంగల్ తుఫాను ఎఫెక్ట్

**-భారీ వర్షంతో తెగిన పూడి-సీకే పురం కల్వర్టు -కల్వర్టు దాటలేక, ఆస్పత్రికి పోలేక మృత్యువాత**

**-పూడి-సీకే పురం బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలింది**



కేవీబీపురం, డిసెంబర్ 2 ప్రభాతవార్త: ఫెంగల్ తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యం లో తిరుపతి జిల్లా కేవీబీ పురం మండలం పూడి, సీకే పురం కల్వర్టు వరద నీటికి కొట్టుకుని పోవడంతో వాగు దాటలేక తీవ్ర అనారోగ్యానికి గురైన వ్యక్తి మృతి చెందిన సంఘటన కేవీబీ పురం మండలంలోని పూడి, సీకే పురం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు... నక్కలకోన రమేష్(పశువుల కాపరి) అడవిలో పశువులు మేపుతూ తీవ్ర ఆరోగ్యానికి గురై అడవిలోని గుంటలో పడిపోయాడు. (మూర్చ వ్యాధి రావడంతో) దీంతో గ్రామస్తులు సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులతో కలసి ఆస్పత్రికి నక్కల కోన రమేష్‌ని మెయిన్ రోడ్డుకు వచ్చి శ్రీకాళహస్తి ఆస్పత్రికి తీసుకెళ్ళడానికి ఎంత ప్రయత్నించినా వీలు లేకుండాపోయిందని గ్రామస్తులు తెలిపారు. వర్షాలు కారణంగా వరదలు పొంగి పారడంతో పూడీ సీకే పురం కల్వర్టు(ఎంఏ రాజుల కండ్రిగ వద్ద ఉన్న కల్వర్టు) తెగిపోవడంతో జనజీవన సంబంధం పూర్తిగా తగ్గింది. ఐదు గ్రామాలకు ప్రధాన సమస్య బ్రిడ్జి నిర్మాణం కానీ కొన్ని సంవత్సరాలుగా పోరాటం సాగిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ప్రతి సంవత్సరం వర్షాలు పడినప్పుడు ఆ ఐదు గ్రామాల ప్రజల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అనేక పర్యాయాలు వాపోయిన సంఘటనలు ఉన్నాయి. కల్వర్టు తెగడం వల్ల విద్యార్థులు కాలేజీలకు, పాఠశాలలకు వెళ్ళలేక పలు ఇబ్బందులు పడుతున్నారు. గర్భవతులు, బాలింతలు వారి పరిస్థితి వర్ణనాతీం. కొన్ని సంవత్సరాలుగా బ్రిడ్జి నిర్మాణం కోసం ఐదు గ్రామాల ప్రజలు పోరాటాలు చేస్తున్నా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఎన్నికల సమయాల్లో హామీల తప్ప చేసేదేమి లేదని వాపోతున్నారు. మృతుని భార్య, ఇద్దరు మగ పిల్లలు, ఒక కుమార్తె కలరు. మృతుడు నిరుపేద కుటుంబానికి చెందిన వారని పశువుల కాపరిగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం అనారోగ్యంతో మృతి చెందడంతో భార్య, పిల్లలు వీధిన పడ్డారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## తుఫాను ప్రభావంతో... నీట మునిగిన వరి పంటలు

**- దిక్కుతోచని స్థితిలో రైతన్నలు**

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 2 ప్రభాతవార్త: తుఫాను ప్రభావంతో శుక్రవారం నుంచి కురుస్తున్న ఎడ తెరపి లేని వర్షం వలన నీటి ప్రవాహం పెరిగి వరిపంట పొలాలు నీట మునిగి కుళ్లిపోయే దశకు చేరుకున్నాయి. వరుస తుఫాన్లతో మండలంలో వ్యవసాయ సాగు కష్ట సాధ్యంగా మారింది. ఆరు కాలం కష్టపడి చేసే రైతన్నకు ప్రభుత్వం అందించేది ఏమీ లేదు. వ్యవసాయ సాగు పెట్టుబడులు పెరిగిపోయి





నీటమునిగిన పంట పొలాలు

కష్ట సాధ్యంగా మారింది. భూమిని నమ్ముకున్న రైతు కొన్న రైతు మాత్రం. వ్యవసాయం వదులుకోలేక పెట్టుబడులు ఎంతైనా సరే అప్పుల బారిన పడి వ్యవసాయ సాగు చేస్తున్నారు. తుఫాను ప్రకృతి వైపరీత్యాలు తెగుళ్ళ అని తట్టుకుని వ్యవసాయ సాగు చేస్తే రైతుకు మిగిలేది అఖరికి అప్పు మాత్రమే. తూతూ మంత్రంగా వ్యవసాయ శాఖ ద్వారా కొన్ని సబ్సిడీ పథకాలు మాత్రమే అందిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. తుఫాను ప్రభావంతో ఇల్లు నీటమునిగి ప్రజలు ఇబ్బందులకు గురైతే రాజకీయ నాయకులు ఆహార సౌకర్యాలు, ఆర్థిక సహాయం అందిస్తారు. కానీ రైతన్నకు మాత్రం సర్వేలు పేరుతో కాలయాపన చేస్తూ ఎటువంటి ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు రారు. ఇకనైనా పాలకులు రైతన్న కష్టం దృష్టి సారించి, వ్యవసాయ సాగులో రైతుకు జరిగే ప్రతి నష్టాన్ని ప్రభుత్వం తనవంతు ఆర్థిక సహాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## అంతర్ వర్సిటీ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



**కుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** కుప్పం డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ బిఎస్సీ చదువుతున్న విద్యార్థిని సుసిత్ర సౌత్‌జోన్ అంతర్ వర్సిటీ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ శాంత నాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ తెలిపారు. తిరుపతిలో జరిగిన అంతర్ కళాశాలల పోటీల్లో ప్రతిభ చూపి తిరుపతి ఎస్వీయు జట్టుకు సుసిత్ర ఎంపికైందన్నారు. వైజాగ్‌లో జరిగే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థినిని, పిడి సుధాకర్‌ను ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు.

## సిఎం చంద్రబాబును కలసిన కుప్పం తెదేపా నేతలు



**కుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లను కుప్పం తెలుగుదేశం పార్టీ యువత నేతలు మాజీ ఎ ఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర ప్రొఫెషనల్ విభాగం ఉపాధ్యక్షుడు డా॥ వెంకటేష్‌ల అధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో తెలుగుయువత తరపున చాలా కష్టపని పనిచేశామని వైకాపా నుంచి పలు ఇబ్బందులు పడ్డామని సిఎంకు వివరించారు. నియోజకవర్గంలో ఉన్న యువతకు సరైన గుర్తింపు ఇవ్వాలని వారు కోరగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జెఎంసి మురళి, తెలుగుయువత మండలాల అధ్యక్షులు సుబ్బు, బాలు, మంజు, కర్లగట్ట పార్టీ అధ్యక్షుడు గిరిధర్ పాల్గొన్నారు.

## సొంత డబ్బు వెచ్చించి సభ్యత్వాల నమోదు



**కుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** మండలంలోని వానగుట్ట పల్లి పంచాయతీ రాగిమానుమిట్టకు చెందిన తెదేపా మైనార్టీ సీనియర్ నేత గౌస్ సోమవారం తన సొంత నగదు మూడు వేలు వెచ్చించి గ్రామంలో ముప్పై మందికి తెలుగుదేశం పార్టీ సాధారణ సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు రిజ్వాన్, నేతలు ఇలియాజ్, ఫయాజ్, అక్మల్, మాబుషరీఫ్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం!

**శ్రీరంగరాజపురం, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాతపాళెంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంను ధ్వంసం చేశారు. పాతపాళెంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం అయిన విషయం తెలిసిన వెంటనే పలువురు నాయకులు గ్రామంకు చేరుకుని తీవ్రంగా ఖండించారు. సమాచారం అందిన వెంటనే కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్‌లు గ్రామంకు చేరుకుని దీనిపై పూర్తి స్థాయి విచారణ ప్రారంభించారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంను ధ్వంసం చేయడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ కేసును పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షం భీభత్సం

**పాలసముద్రం, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** ఫెంగాల్ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలు పాలసముద్రం మండలంలో భీభత్సం సృష్టించాయి. మండల పరిధిలో కురిసిన భారీ వర్షాలకు ఇప్పటికే పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతిని రైతులు కోలుకోలేని విధంగా నష్టాలు చవి చూశారు. చిత్తూరు జిల్లాలోని తుఫాను ప్రభావంతో కురిసిన అధిక వర్షాల్లో ఒక మండలమైన పాలసముద్రంలో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాలు పూర్తిగా వర్షపు నీటితో మునిగిపోవడంతో చెరువులుగా మారాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం వర్షంతో సర్వం కోల్పోయిన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా వుంది.

## పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 24 సమస్యలు

చిత్తూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ మణికంఠ చందోలు సోమవారం పాత జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు 24 సమస్యలు ఎస్పీని కలిని విన్నవించుకున్నారు. ఎస్పీ మణికంఠ చందోలు వారి సమస్యలను ఆలకించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అదికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూతగాదాలకు సంబంధించి 7, ఇంటి తగాదాలపై 5, కుటుంబ కలహాలపై 4, వేధింపులు 5, ఆర్థిక లావాదేవిలపై 3, చీటింగ్‌పై ఒక ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో సమస్యలు పరిష్కారం : కమీషనర్

**చిత్తూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** ప్రజల నుండి సమస్యలపై వచ్చిన వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని గ్రీవెన్స్ హాలులో సోమవారం మున్సిపల్ కమీషనర్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, ఎంఇ వెంకటరామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య!

**చిత్తూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** చిత్తూరు గిరింపేట గంగినేనిచెరువులో సోమవారం ఓ వ్యక్తి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జయరామయ్య వెల్లడించిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం గంటలకు ఓ వ్యక్తి గంగినేనిచెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం అందిందన్నారు. పోలీసుల విచారణలో మృతి చెందిన వ్యక్తి గిరింపేట రాఘవేంద్రకాలనీకి చెందిన విజయభాస్కర్(38)గా గుర్తించడం జరిగిందన్నారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో అగ్నిమాపకశాఖ హెడ్‌కానిస్టేబుల్‌విజయ్‌కుమార్, సిబ్బంది ఏలుమలైశెట్టి, అక్బర్, జ్యోతీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మామిడి నిల్వ గుజ్జు తరలింపుకు చర్యలు

– కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త: ఇజ్రాయిల్ యుద్ధం కారణంతో జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమల వద్ద నిల్వ వున్న గుజ్జును తరలించడానికి ఉన్నత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో సోమవారం రాత్రి కలెక్టర్ సుమిత్‌కుమార్ మామిడి గుజ్జు పరిశ్రమల యాజమానులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన అధికారి మధుసూధన్‌రెడ్డి, ఎల్‌డిఎం హరీష్, చిత్తూరు పండ్ల గుజ్జు పరిశ్రమ కార్యదర్శి గోవర్ధన్‌బాబీ, సభ్యులు బాబురెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సుమీర్‌శర్మ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.65 వేలు విలువైన గంజాయి స్వాధీనం : ఇద్దరు అరెస్టు

చిత్తూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిత్తూరు కొండమిట్ట ఏఆర్ టాప్‌లైన్ శిధిలమైన నివాసాల్లో అనుమానస్పదంగా వున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు తనిఖీ చేస్తే వద్ద 65 వేల రూపాయల విలువైన 2 కేజీల గంజాయి లభ్యమైందని ఇన్స్‌పెక్టర్ జయరామయ్య తెలిపారు. ఈ మేరకు గంజాయి నిల్వ వుంచిన చిత్తూరు చామంతిపురంకు చెందిన పి.మూర్తి(55), కొంగారెడ్డిపల్లికి చెందిన చేతన్(22)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన చుడా ఛైర్‌పర్సన్

**పలమనేరు,డిసెంబర్ 2 ప్రభాతవార్త:** పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి(చుడా)ఛైర్‌పర్సన్ కటారి హేమలత సన్మానించారు. చుడా ఛైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేపట్టిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకున్న ఆమె ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్‌వి బాలాజీ,పట్టణప్రధాన కార్యదర్శి గిరిబాబు, గంగవరం టిడిపి అధ్యక్షులు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో రెండు చోట్ల చోరీ

**పలమనేరు,డిసెంబర్ 2 ప్రభాతవార్త:** పట్టణంలో ఆదివారం రాత్రి రెండు ప్రాంతాలలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుల కథనం మేరకు... పట్టణంలోని ఓ సంచుల దుకాణంతో రూ.30వేల నగదు,స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న క్రీడా కేంద్రంలో సుమారు రూ.లక్ష విలువ చేసే క్రీడా సామాగ్రిలను చోరీ చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఇరు ప్రాంతాలను పరిశీలించి కేసు నమోదు చేసి సిసి కెమరాల ఆధారంగా నిందితులను గాలిస్తున్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి : సిఐ

**పలమనేరు,డిసెంబర్ 2 ప్రభాతవార్త:** మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని మహిళా పోలీసులకు సిఐ నరసింహరాజు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ నానాటికి సైబర్ నేరాలు పెరిగిపోతున్న తరుణంలో ఎప్పటికప్పుడు నేరాల నియంత్రణకు సిబ్బంది కృషి చేయాలని ప్రజలను అప్రమత్తం చేస్తు అవగాహన కల్పించాలని మహిళా పోలీసులకు సూచించారు. ఎస్ఐ స్వర్ణతేజ,మహిళ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## వరిపంట సంరక్షణ పద్ధతులు పాటించాలి

**చౌడేపల్లి, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** ఫెంగల్ తుఫాను కారణంగా దెబ్బతిన్న వరిపంట సంరక్షణ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారిణి జ్యోతమ్మ అన్నారు. స్థానికంగా ఆమె మాట్లాడుతూ తుఫాను కారణంగా మండలంలో సుమారు 142హెక్టార్ల వరిపంట దెబ్బతిన్నదన్నారు. పొలాల్లో నిలచిన వర్షపునీటిని బయటకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకొని వరిపంటపై 5శాతం ఉప్పుద్రావణాన్ని పిచకారీ చేయాలన్నారు. వరిపంట నష్టపోయిన రైతుల వివరాలు రైతుసేవాకేంద్రాల వారీగా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు వివరించారు.

## పారిశుద్ధ్య సమస్యపై గ్రామస్తుల దర్నా

**పెద్దపంజాణి, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** మండలంలోని పంజాణి సత్రంలో పారిశుద్య సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామస్థులు సోమవారం పెద్దఎత్తున పలమనేరు–మదనపల్లి జాతీయ రహదారిపై బైటాయించి దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మండలస్థాయి అధికారులు తరచూ గ్రామాల్లో సంచరించడం ఫోటోలుతీసి పత్రికలకుఇచ్చి ప్రచారం చేసుకుంటున్నారేతప్ప పలుచోట్ల పారిశుధ్యం అధ్వాన్నంగా మారినా పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. పారిశుధ్యం అధ్వాన్నంగా మారడంతోపాటు మురుగునీరు నిల్వఉండటంతో దోమలసంచారం పెరిగి ప్రజలు జ్వరాలబారిన సైతం పడుతున్నట్లు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

## సంచారజాతుల సమస్యలను పరిష్కరించాలి



**పెద్దపంజాణి, డిసెంబర్2 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న సంచారజాతులవారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర సంచారజాతుల సంఘం అధ్యక్షుడు పూసల రవి, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ జిల్లా సంఘనేతలు రెడ్డెప్ప.నాగభూషణం,వేణు,రమేష్,ఉమా, శంకరమ్మ, సుబ్బు తదితరులు సోమవారం ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత వెనుకబడిన కులాలవారిని గుర్తించేందుకు సీడ్ సర్వే చేపట్టాలని ఆదేశించాయన్నారు. మండలస్థాయిలో ఎంపీడీఓలు ఈ సర్వేను నిర్వహిం చాల్సి ఉందన్నారు. తమకు తగు న్యాయంచేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మె ల్యే పెద్దపంజాణి ఎంపిడిఓతో ఫోన్‌లో మాట్లాడారు. ఎంబిసికులాల సర్వేను ఖచ్చితంగా చేయాలని ఆదేశించారు.

## తవణంపల్లెలో ఘనంగా ఎయిడ్స్ ర్యాలీ

**తవణంపల్లె, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం తవణంపల్లెలో సోమవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ మోహనవేలు, డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ కేశవనారాయణల ఆధ్వర్యంలో ఈర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మండల వైద్యసిబ్బంది, స్థానిక టి.పుత్తూరు రోడ్డు నుండి పాత పోలీస్‌స్టేషన్ వరకు గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌ఓలు, పీహెచ్‌ఎన్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు,ఏఎన్‌ఎంలు, ఆషా వర్కర్లు పాల్గొన్నారు.

## నేడు కాణిపాకం ఆలయ హుండీల లెక్కింపు

**కాణిపాకం, డిసెంబర్ 2 ప్రభాతవార్త** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలో మంగళవారం హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు జరిగే హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక పాల్గొనాలని తెలిపారు.



## గణనాధుని సేవలో తెలంగాణా ఎన్‌సీసీ డీజీ

కాణిపాకం, డిసెంబర్ 2 ప్రభాతవార్త: తెలంగాణా ఎన్‌సీసీ డైరక్టర్ జనరల్ మధుసూధన్‌రెడ్డి సోమవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి

**కుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** ప్రజారవాణా సంస్థ అయిన ఆర్టీసీ బలోపేతానికి శక్తివంచన లేకుండా



కృషి చేస్తా మని ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని ప్రాంతీయ కార్యాలయంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ నేతృత్వంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రయోజనాలు, ఆర్టీసీలో నెలకొన్న సమస్యలు తదితరాలపై చర్చించారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల పెంపు, డిపోల అభివృద్ధి తదితరాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమాల్లో నెల్లూరు జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు, విజయవాడ జోన్ ఛైర్మన్ అప్పలనాయుడు, విజయనగరం ఛైర్మన్ దొన్నుదొర, నాలుగు రీజియన్ల ఇడిలు, డైరెక్టర్లు,పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎడతెరిపి లేని వర్షం పంటలకు తీవ్ర నష్టం



**సోమల, డిసెంబర్ 2 ప్రభాతవార్త** తుఫాను ప్రభావంతో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజాజీవనం అతలాకుతలం అయింది. ముఖ్యంగా కోతకు వచ్చిన వరి పొలాలు నీట మునిగాయి. మండలంలో దాదాపు 500 హెక్టార్లు నీట మునిగినట్లు ప్రాథమిక అంచనా. మరి కొన్నిచోట్ల నేల ఒరిగిన వరి పైర్లు మొలకెత్తి దశలో ఉన్నాయి. మండలంలో ప్రధాన పంట అయిన టమోటో వర్షం దాటికి పూర్తిగా నాశనం అయ్యింది. పక్వానికి రాకుండానే కాయలు నేల రాలుతున్నాయి. రహదారులు గుంతలు మయం కావడం వల్ల పాదచారులు ఎక్కడ గుంత ఎక్కడ దారో తెలియక ప్రయాణించేందుకు జంకుతున్నారు. పూరి గుడిసెలు, మట్టి మిద్దెలు ఉరుస్తుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

## ఫెంగల్ తో తంటాలిన్నిన్ని కావు...



**పుంగనూరు,డిసెంబరు 2 ప్రభాతవార్త :** రెండురోజులుగా పీడించిన ఫెంగల్ తుఫాను దెబ్బకు పట్టణంతో పాటూ, గ్రామీణ ప్రాంతాలన్నీ కూడా దారుణంగా తయారయ్యాయి. మట్టిగోడల పేదలిండ్లు కాస్త కరగిపోయి కూలిపోగా, ఆరుగాలం పండించిన వరి మొత్తం చేలోనే తడిసి పోవడంతో రైతులు దారుణంగా నష్టానికి గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఫెంగల్‌తుఫాను ప్రభావం పుంగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ మీద తీవ్రంగానే పడింది. సబ్‌డివిజన్ పరిధిలో అత్యధికంగా సోమలలో 52 మిమిల వర్షపాతం నమోదు కావడంతో పాటూ పుంగనూరు పట్టణంలో కూడా జడివాన నమోదయింది. ఇదేరీతిలో సదుంలో 20.4,పులిచర్లలో 21.6,రొంపిచర్లలో 21.4మిమిల వర్షపాతం నమోదు కావడంతో గ్రామాలలో చిన్ననీటికుంటలన్నీ నిండిపోయాయి. సోమల మండలంలో నీటికుంటలతో పాటూ చెరువులలో పెద్దఎత్తున నీరు చేరింది. పూర్తిగా మెట్టప్రాంతాలైన పడమటి మండలాలలోని పుంగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ మండలాలలో ఏటా వరి అధికంగానే పండిస్తా్రు. మరో కొన్ని రోజులలో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంటలు ఫెంగల్‌తుఫాను తాకిడితో నేలకొరిగాయి. సోమలలోనే 500 హెక్టార్లకుపైగా వరిపంట నేలకొరిగి తడిసిపోయింది. ఈపంటలను సోమవారం మధ్యాహ్నం పరిశీలించిన వ్యవసాయసహాయాధికారి శివకుమార్ రైతాంగానికి వరిని జాగ్రత్తగా కాపాడుకోవడంపై సలహాలిచ్చారు. కాగా వర్షంధాటికి పట్టణంలోని కోనేరు ఆనుకుని నిర్మించిన అక్రమ కట్టడం నేలకొరిగిపోయింది. పట్టణంలో పలు దారులు దారుణంగా దెబ్బతిన్నాయి. రోడ్లు గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.ప

## జనసేనలో 60మైనార్టీ కుటుంబాల చేరిక



**పుంగనూరు,డిసెంబరు 2 ప్రభాతవార్త :** ఇంతకాలం పుంగనూరు నియోజక వర్గంలో రెండు ప్రధాన పార్టీల హవాసాగినా,ఇపుడు నేనుసైతం అంటూ జనసేన పార్టీ బరిలో ముందుకురుకుతోంది. ఇటీవల చదళ్ళకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి జనసేనలో చేరడం తో ఆయన వెంట పలువురు పార్టీలోనికి వలసకడుతున్నారు. సోమవారం చౌడేపల్లి మండలానికి చెందిన 60 ముస్లిం కుటుంబాలు వేణుగోపాల్‌రెడ్డికి తమ మద్దతు ప్రకటిస్తూ జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ వ్ఆర్ ట్రస్టు ద్వారా వేణుగోపాల్‌రెడ్డి తమ గ్రామంలో అన్ని కుటుంబాల వారికి ఎన్నో విధాలుగా సేవలందించారని, సాయపడ్డార న్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, విరూపాక్షి, పగడాలరమణ, చిన్నారాయల్,చైతన్య,నరేష్,జావెద్,ఫరీద్‌ఖాన్ జనసేన నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారుడిపై చేయిచేసుకున్న ఏఎస్ఐ

**పుంగనూరు,డిసెంబరు 2 ప్రభాతవార్త :** పట్టణ ఏఎస్ఐ దామోదర్ ఒక ఫిర్యాదుదారునిపై చేయిచేసుకుని దుర్భాషలాడినట్లు ఎస్‌డిపిఐ నాయకుడు యూసుఫ్‌బాషా ఆరోపించారు. పట్టణంలో కోళ్ళవ్యాపారం చేసుకునే సిద్దిక్ వద్ద మహబూబ్‌బాషా కోళ్ళు కొని రెండులక్షలు బకాయిపడ్డాడు. ఈనేపథ్యంలో ఈ తగాదా స్టేషన్‌కు వెళ్ళింది.అయితే, ఇరుపక్షాలను రప్పించి కేసులు నమోదు చేయకుండా ఏఎస్ఐ దామోదర్ మహబూబ్‌బాషాను కొట్టి దారుణంగా దూషించాడని, ఆయనపై చర్య తీసుకోవాలని సిఐకు విజ్ఞప్తిచేశారు.

## ఏఎన్ఎం హరితకు ప్రశంస పత్రం




**కల్లూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** పులిచెర్ల మండలం మతుకువారిపల్లి సచివాలయం ఆరోగ్య కార్యకర్త హరిత విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఉత్తమ ప్రశంసా పత్రం అందుకున్నారు. చిత్తూరులో జరిగిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా డి.ఎం.హెచ్. ఓ ప్రభావతి హరితకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ప్రశంసా పత్రం అందుకున్న హరితను కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జానకి రావు, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు అభినందించారు.

## ఎలిఫెంట్ హ్యాబ్ ఏర్పాటుపై ఎమ్మెల్యే సమీక్ష



**పలమనేరు,డిసెంబర్ 2 ప్రభాతవార్త:** పలమనేరులో ఎలిఫెంట్ హబ్ ఏర్పాటుకు చర్యలను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి వేగవంతం చేశారు.స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం పలమనేరు డిఎఫ్ఓ నారాయణతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీలో పలమనేరులో ఎలిఫెంట్ హబ్ ఏర్పాటుతో ఏనుగుల నియంత్రణ మరియు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధిపై ప్రస్తావించారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి,అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కు నివేదికను సమర్పించారు. క్షేత్ర స్థాయిలో ఎలిఫెంట్ హబ్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రెండు వారాలుగా కర్ణాటక రాష్ట్రంలో 20 మందికి పైగా ఎలిఫెంట్ శిక్షకులు,అటవీ శాఖ సిబ్బంది శిక్షణ పొందుతున్నారని,ఏనుగుల కట్టడి చేసేందుకు క్రాల్ ఏర్పాటు,శిక్షణ పొందిన ఏనుగుల కొరకు ఎన్‌క్లోజర్,సిబ్బంది క్వార్టర్స్,డిస్పెన్సరీ ఏర్పాట్లకు అంచనాలు సైతం రూపొందించామని,టూరిజం హబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎఫ్ఆర్ఓ ఎమ్మెల్యేకు వివరించారు. తక్కువ వ్యయంతో ప్రాజెక్టు పూర్తి చేయాలని,నిధుల అంశంలో ఏదైన ఇబ్బందులు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ

# తిరుపతి డివిజన్

## సాధారణం కన్నా అధికం... తీరిన నీటి కరువు

–ఇక మూడేళ్ళ వరకు భూగర్భ జలాలకు దిగుల్లేదు



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి పరిసరాల్లో ఈ ఏడాది సాధారణ సగటు వర్షపాతం కన్నా అత్యధికంగానే నమోదైంది. గత కొన్ని సంవత్సరాలుగా స్వర్ణముఖిలో వరద ప్రశ్నార్ధకంగా మారింది. ఈ ఏడాది కూడా ఇక నదదికి వరద లేదని భావించారు. కానీ వరుణుడు తుఫానుల రూపంలో కరుణించాడు. నీటి కరువును తీర్చాడు. దాంతో ఇక మూడేళ్ళ వరకు పరివవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలకు దిగుల్లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక పట్టణంలోని నారద పుష్కరిణి, వైష్ణవ కోనేరు ఓ మోస్తరుగా నిండాయి. కాబట్టి పట్టణంలోని పరిసరాలో భూగర్భజలాలకు కొదవ లేదని భావిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబర్ మాసం వర్షపాతం సగటు 229 మి.మీలు కాగా 305 మి.మీలు నమోదు అయ్యింది. వంబర్ సాధారణ సగటు వర్షపాతం 330 మి.మీలు కాగా 220 మి.మీలు నమోదైంది. డిసెంబర్ సాధారణ సగటు వర్షపాతం 174 మి.మీలు కాగా సోమవారం ఉదయానికి 100 మి.మీలు నమోదైంది. దాంతో రైతుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిస్తున్నాయి.

## నిరుపేదలకు వైద్యం సకాలలో అందించాలి



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 2 ప్రభాతవార్త :** నేడు కార్పొరేట్ రంగంలో నిరుపేదలకు అందని రీతిలో వైద్యం ఉందని బాధలతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వచ్చే నిరుపేదలకు సకాలంలో వైద్యసదుపాయాలు అందించాలని జిల్లా టాస్క్ ఫోర్సు అధికారి డాక్టర్ శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. సోమవారం ఆయన శ్రీరామనగర్ కాలనీలోని యుపిహెచ్‌సి సెంటర్‌ను ఆకస్మికంగా తనికీ చేసారు. ఈ సందర్బంగా సిబ్బందితో మాట్లాడుతూ యుపిహెచ్‌సిల ఏర్పాటు ముఖ్య ఉద్దేశ్యం సకాలంలో సత్వరం అందుబాటులో వైద్యసదుపాయాలు అందించాలన్నదే అన్నారు. ముఖ్యంగా గర్బవతులకు సంబంధించి సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహారించాలని సూచించారు. ప్రతి నెల గర్బవతులను వైద్యపరీక్షలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో యూపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బాబు, ఆయుర్వేద డాక్టర్ శైలజ, డాక్టర్ స్రవంతి, డాక్టర్ రెడ్డి రూపేష్, డిపిఓ ప్రకాష్,ఎస్ఓ నాగేంద్రబాబు, సూపర్‌వైజర్లు కళావతి, సురేష్‌బాబు, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## మారథన్ 10కిలో మీటర్లు పోటీల్లో శ్రీకాళహస్తికి బహుమతి




**శ్రీకాళహస్తి,డిసెంబర్ 2 ప్రభాతవార్త :** విశాఖ సాగర తీరంలో నిర్వహించిన వైజాగ్ రన్నర్స్ సొసైటీ సారధ్యంలో సంధ్యామెరైన్స్ నిర్వహించిన మారథాన్ 10కిలో మీటర్ల విభాగంలో శ్రీకాళహస్తికి చెందిన సీనియర్ వెటరన్ రమణారెడ్డి (60) మూడవ బహుమతిని గెల్చుకొని శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నిత్య ఫిట్‌నెస్ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న రమణారెడ్డి 10కె మారథాన్‌లో విశేష ప్రతిభను కనపరచి మూడవ బహుమతిని గెల్చుకున్నారు. ఫిట్‌నెస్ కేంద్రం నిర్వాహకులు జ్యోతిరావు కొంతమందిని పోటీలకు తీసుకెళ్ళారు. వీరిలో రమణారెడ్డి తమ ప్రతిభను చూపి విజేతల్లో మూడవ స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో పూర్వం ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన రమేష్‌బాబు కూడా పాల్గొన్నారు.

## ఇటు విధి నిర్వహణ... అటు వరద నీరు



**శ్రీకాళహస్తి రూరల్,డిసెంబర్ 2 ప్రభాతవార్త :** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఫెంగల్ తుఫాను బీభత్సం సృష్టించింది. సోమవారం ఓ ఉపాధ్యాయుడు విధి నిర్వహణ జవాబుదారితనంతో తమ ద్విచక్రవాహనంపై వెళుతూ వరదనీటిలో చిక్కుకున్నారు. కొందరు యువకులు గమనించి సాహసించి ఒడ్డుకు చేర్చారు. తృటిలో తప్పిన ప్రమాదంతో ఆ ఉపాధ్యాయుడు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏర్పేడు మండలం రాజుల కండ్రిగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రత్న కుమార్ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. ఆయన సోమవారం ఉదయం పాఠశాలకు తన ద్విచక్రవాహనంపై బయలు దేరారు. గోవిందవరం నుంచి రాజుల కండ్రిగకు వెళ్ళు దారిలో స్వర్ణముఖి వంక దాటాల్సి ఉంది. వంతెన మీద నీరు ప్రవహిస్తుండటం మరో వైపు పాఠశాలకు వెళ్ళె టైం అవటంతో ఉపాధ్యాయుడు సాహసించి వెళ్లి పోవచ్చునని భావించారు. వరద జోరు మోటార్‌సైకిల్ పడపోగా అక్కడ పరిశీలిస్తున్న కొందరు యువకులు రోప్‌ల సహాయంతో కొట్టుకుపోతున్న ఉపాధ్యాయుని కాపాడి, మోటార్‌సైకిల్‌ను బయటకు తీసారు.

## బాడీ బిల్డింగ్‌లో ద్వితీయ బహుమతి

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 2 ప్రభాతవార్త :** తిరుపతిలో జరిగిన బాడీబిల్డింగ్ పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన షేక్ సమద్ ద్వితీయ బహుమతిని సాధించారు. తిరుపతిలో ఆదివారం ఉమ్మడి చిత్తూరుజిల్లా,కడప జిల్లా పరిధిలో బాడీ బిల్డింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీకాళహస్తి నుంచి సందీప్ జిమ్ నుంచి కొందరు హాజరయ్యారు. ఈ పోటీలకు జిమ్ నుంచి షేక్ సమ్మద్ హాజరయ్యారు. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. విజయం సాధించిన సమ్మద్‌ను జిమ్‌లో నిర్వాహాకులు సందీప్ సారధ్యంలో సత్కరించారు. రాబోవు రోజుల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయం సాధించాలని కోరారు.

## నీట మునిగిన పంటపొలాలు



**తొట్టంబేడు, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** ఫెంగాన్ తుఫాను ప్రభావం మండలంలో తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని చెప్పవచ్చును. మండలంలో సాయంత్రం 4గంటల వరకు మండలంలో 14.2మి.మీ వర్షపాతం నమోదైందని చెప్పవచ్చును. ఆదివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి మండల తహశీల్దార్ కార్యాలయంలో వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఉన్న భారీ వృక్షం నేలకూలింది. కాగా ప్రస్తుతం రబీ సీజన్ కావడంతో మండలంలో వరి, వేరుశనగ పంటలును వేస్తున్నారు. ఇక అన్ని పంటలు కలిపి 4653హెక్టార్లలో వేస్తారని వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి తెలిపారు. మండలంలో ఎక్కువగా రైతులు కెఎన్ఎం 1638, బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048 రకాలు వేస్తారు. పెంగాన్ తుఫాను ప్రభావంతో మండలపరిషత్ తహశీల్దార్ కార్యాలయం చుట్టు ఉన్న ప్రహరీగోడ గోలనేలకూలింది. ఇక పక్కనే ఉన్న వసతిగృహాల్లో నీళ్ళురావడంతో స్పందించిన ఎంఎల్ఏ వసతిగృహాల్లో నీళ్ళు రాకుండా క్రషర్‌మట్టిని తోలి జెసిబితో చదరం చేయించి ఇక్కడ ఉంటున్న విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. మండలంలో మైనర్ చెరువులు 93 ఉండగా వీటిలో 32 చెరువులు తెలుగుగంగ కాలువకింద ఉన్నాయి. ఇక మీడియం చెరువులు 11 ఉన్నాయి. మొత్తం 9,100 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నాయి. ఇక పంటపొలాలు ఎక్కడ చూసినా చెరువులును తలపిస్తున్నాయి. వర్షం తగ్గుముఖం తగ్గిన తర్వాత పంటనష్టాన్ని అంచనా వేయాలని పలువురు కోరుతున్నారు.

## సమస్యను పరిష్కరించిన ఎంఎల్ఏ



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** పారిశుధ్యానికి పెద్దపీటవేసేందుకే ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ప్రత్యేక మైన శ్రద్ద చూపుతున్నారని రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు బుజ్జి తెలిపారు. సోమవారం ఎడతెరపిలేకున్నా కురుస్తున్న వర్షాలకు ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా వెంటనే సమస్యలను పరిష్కరిస్తున్నారని బుజ్జి తెలిపారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ నగర్, తెలుగుగంగ కాలనీ వద్ద మురగునీరు ఎటు వెళ్ళలేని స్థితితో పక్కనే ఉన్న మున్సిపల్ సరస్వతీ బాయి పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నీరు పోకుండా దుర్వాసన వస్తుండడంతో ఈసమస్యను ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్ళడంతో వెంటనే సమస్యను పరిష్కరించమని ఆదేశాలు జారీచేయడంతో స్పందిన ఆయన జెసిబితో మురుగునీటిని తొలగించి ప్రజల సమస్యలను తొలగించారు

## లైంగిక వేధింపుల నిరోధ చట్టంపై అవగాహన

**తిరుపతి విద్య డిసెంబర్ 2 ప్రభాతవార్త:** పద్మావతి మహిళా వర్సిటీ హ్యూమానిటీస్ బ్లాక్ సెమినార్ హాల్లో సోమవారం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహిళల పై లైంగిక వేధింపుల నిరోధక చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి ఉమాదేవి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలను అసభ్యకర మాటలు, ప్రవర్తన,సైగలు వంటి చేష్టలు ద్వారా కొందరు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. మహిళా అధ్యయన కేంద్ర ప్రాజెక్ట్ అసిస్టెంట్ డాక్టర్ ఎం ఇంద్రాణి,సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

## ముక్కోటి అగస్త్వీర స్వామికి సహస్ర ఘటాభిషేకం



**చంద్రగిరి, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారికి సోమవారం పాడ్యమి రోజున ఆలయ అర్చకులు ఉదయం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంను పురస్కరిం చుకుని భక్తులు అత్యంత భక్తి ప్రపత్తులతో అగస్త్యేశ్వర స్వామి వారిని ఆరాధించుకున్నారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఆలయం తరపున భక్తులకు సేవా కార్యక్రమాలను అందించడంతో పాటు దాతల సహకారంతో భక్తులకు అన్నదానాలు జరిపించారు. స్థానిక ఆర్.ఎఫ్ రోడ్డులోని శ్రీ శ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి వారు సోమవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.అనంతరం స్వామి వారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

## బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

**పాకాల, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** పాకాల మండలాని చెందిన భువి డిసెంబర్ ఒకటవ తారీకున ఆదివారం రోజున విజయవాడలో నిర్వహించబడ్డ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో సతీష్ అడ్డాల, వాహ్ అకాడమీ సుభాన్ ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ బెస్ట్ మేకప్ ఆర్టిస్ట్ పోటీలో పాకాల వాస్తవ్యులు శ్రీమతి భువి మొదటి విజేతగా గెలుపొందారు. ఈ కార్యక్రమంలో దర్శకులు శ్రీకాంత్ అడ్డాల, చోటా కె నాయుడు, యాక్టర్ సత్యం రాజేష్, బిగ్ బాస్ ఫేం శ్రీ సత్య, జెస్సీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

## ఎమ్మెల్యే చొరవతో నిండిన తట్నేరి చెరువు



**వడమాలపేట, డిసెంబరు 2 ప్రభాతవార్త:** వడమాలపేట మండలం తట్నేరి చెరువు సమీపంలో అటవీ ప్రాంతం నుంచి సప్లయ్ ఛానెల్ ద్వారా నీరు చేరేది. పాదిరేడు అరణ్యం భూములు టీటీడీ ఇళ్ళ స్థలాలకు అప్పగించడంతో ప్లాట్స్ కేటాయింపులో భాగంగా చదును చేసే క్రమంలో సప్లయ్ ఛానెల్‌ను పూడ్చి వేశారు. గత రెండు సంవత్సరాల నుంచి చెరువుకు నీళ్ల రాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులను ఆదేశించి సమస్య పరిష్కారం చేయాలని సూచించారు. ఇరిగేషన్ అధికారులు టీటీడీ అధికారులతో తిరిగి సప్లయ్ ఛానెల్‌ను పునరుద్ధరించడంతో చెరువులోకి కాల్వను మళ్లించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ తట్నేరి చెరువుకు జలహారతి ఇచ్చి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## పిడతల కోన చెరువు తూము లీకేజీ

**వడమాలపేట, డిసెంబరు 2 ప్రభాతవార్త:** వడమాలపేట మండలం బంగారెడ్డి కండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలోని పిడతల కోన చెరువు తూము లీకేజీ అవుతుంది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. సోమవారం ఎంపీడీవో శేషగిరిరావు ఆదేశాలతో ఇరిగేషన్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి లీకేజీని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలసహకారంతో ఇసుక బస్తాలు వేసి తాత్కాలికంగా అరికట్టారు. చెరువు నీళ్ల ఆది ఆంధ్రవాడ గ్రామంలోకి ప్రవేశించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

## లో తట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 2 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావం వలన మండలంలో కురుస్తున్న వర్షాలు వలన నీటి ప్రవాహం పెరిగి వాగులు వంకలు పంట పొలాలు నీట మునిగి వరద ఉధృత పెరిగింది. అందు వలన ప్రజలు తుఫాను ప్రభావం తగ్గే వరకు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ విశ్వనాథం నాయుడు, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు సూచనలు అందజేశారు. నది ప్రవాహ ప్రాంతాలైన బంగ్లతోట, చిన్నాయగుంట, పూసలపల్లి గ్రామాలను రెవెన్యూ సిబ్బంది సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు.

## శ్రీ సదాశివ ఆలయంలో కార్తీక లక్ష దీపోత్సవం

**పుత్తూరురూరల్, డిసెంబరు 2 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో తమిళ కార్తీక నెల సందర్భంగా సోమవారం సాయంత్రం ఆలయ ఆవరణలో కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

## ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవ అవగాహన ర్యాలి



**తిరుపతి విద్య, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** యస్.జి.యస్ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవ అవగాహన ర్యాలి నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.సత్యనారాయణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ,నేటి విద్యార్థులే భావి భారత పౌరులు కావున ఎయిడ్స్ మహమ్మారి పట్ల అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.పరమేశ్వర, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డా.పి శివకుమార్, బి.సులోచనారాణి, కొటేశ్వరయ్య, అధ్యాపక సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్ కళాశాల టీచింగ్ స్టాఫ్ టోర్నమెంట్



**తిరుపతి విద్య, డిసెంబర్ 2 ప్రభాతవార్త:**ఎస్వీయూ పరిధిలో పనిచేస్తున్న టీచింగ్ స్టాఫ్ అంతర్ కళాశాలల టోర్నమెంట్ సోమవారం వర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో నిర్వహించారు.ఈ టోర్నమెంట్లో చెస్,బ్యాడ్మింటన్ బాల్, బ్యాడ్మింటన్లో పురుషులు,మహిళల విభాగాలలో జరిగిన పోటీలకు వర్సిటీ పరిధిలోని పలు కళాశాలల నుంచి అధ్యాపకులు హాజరయ్యారు.ప్రతిభ చూపిన అధ్యాపకులకు వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు ట్రోఫిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బీవీ మురళీధర్,ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం శివశంకర్రెడ్డి పాల్గొన్నారు.

## నాపై నిందలు మోపితే...

### నిరంతరం నా పోరాటం ఇలానే ఉంటుంది -వైసీపీకి పులివర్తి నాని కౌంటర్




**తిరుపతి హెల్త్, డిసెంబర్2 ప్రభాతవార్త :** చంద్రగిరి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డికి తనకు గత వైసిపి పాలనలో ఐదేళ్లు మాత్రమే పోరు సాగిందని దాని పర్యావసానం నేటికీ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బాంధవ్యులు తనపై నిరాదరణ లేని నిందలు మోపడం పట్ల చంద్రగిరి ప్రస్తుతం ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లోసోమవారం సాయంత్రం నాని మాట్లాడుతూ చెవిరెడ్డికి గురు సమానులైన తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఎలమందలో జరిగిన బాలిక పోక్సో కేసు కు సంబంధించి , శిష్యుడు చెవిరెడ్డిని వెనకేసుకుని ఆదివారం ప్రెస్ మీట్ పెట్టడం పట్ల స్పందిస్తూ ఈ విషయాన్ని వైసీపీ నేతల విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.

## గోడ పత్రిక ఆవిష్కరణ



**తిరుపతి విద్య డిసెంబర్ 2ప్రభాతవార్త:** ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మానవ హక్కుల పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించే వ్యాసరచన, వక్తృత్వ పోటీల గోడపత్రిక సోమవారం వీసీ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి,కల్చరల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్,మానవ హక్కుల విభాగ ఒప్పంద అధ్యాపకులు డాక్టర్ గట్టు రంజిత్ కుమార్,డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రేపు అబకలదొడ్డిలో ప్రజాదర్బార్

**కుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామంలో ఈనెల 4వతేది ప్రజాదరా ్బర్ - మన పంచాయతీ వద్దకే మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. పంచాయతీ ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## గడ్డివామి కూలి ఆవుదూడమృతి



**రామకుప్పం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** మండలంలోని పంద్యాలమడుగు పంచాయతీ ఎస్. గొల్లపల్లి గ్రామంలో ఫెంగల్ తుఫాను ధాటికి గడ్డివామి కూలి ఓ ఆవుదూడ మృతి చెందింది. గ్రామానికి చెందిన ఆనందగౌడు పాడి ఆవుల ద్వారా జీవనోపాధి పొందేవాడు. ఈ నేపథ్యంలో పాడి ఆవు, దూడను గడ్డివామి కింద కట్టి ఉంచగా వర్షానికి గడ్డివామి నేలకూలడంతో ఆవుదూడ మృతి చెందిందన్నారు. దాదాపు రెండు లక్షల దాకా నష్టం కలిగిందని

## జియో ట్యాగింగ్ పై అపోహలు వద్దు : కమిషనర్



**తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న జియో ట్యాగింగ్ పై ఎవరికి అపోహలు వద్దని, మీకు వచ్చిన ఓటిపిని సచివాలయ కార్యదర్శులకు చెప్పి సహకరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతోను, ఆన్లైన్ ద్వారా సచివాలయం కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. జియో ట్యాగింగ్ కొరకు వెళ్తే ప్రజలు సహకరించడం లేదని పలువురు కమిషనర్ కు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నివసిస్తున్న వారి యొక్క వివరాల కోసం నగరపాలక సంస్థ సచివాలయం సిబ్బంది కావాల్సి న సమాచారం సేకరిస్తున్నారని అన్నారు. ఇందులో ఎటువంటి మోసాలకు తావు లేదన్నారు. అలాంటి అపోహాలొద్దని, ఇది పూర్తిగా ప్రభుత్వం చేస్తున్న సర్వే అని, అందరూ సహకరించాలని కమిషనర్ అన్నారు. ఇదే విషయాలను అధికారులు ప్రజలకు తెలిపి జి యో ట్యాగింగ్, ఎన్.పి.సి.ఐ, ఎం.ఎస్.ఎం.ఈ, సర్వీసులు వంద శాతం పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.నగరపాలక సంస్థ లోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయానికి 48 ఫిర్యాదులు



**తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నాడు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేసి స్టేషన్ కు వెళ్లి కూడా సరైన పరిష్కారం జరగని ఫిర్యాదు దారులకు భరోసా కల్పించి వారికి తగిన న్యాయం చేసి తక్షణమే పరిష్కరిం చాలననే ముఖ్య ఉద్దేశంతో ఈరోజు ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో జూమ్ ముఖాముఖి కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి బాధితులు నేరుగా సంబంధపడిన స్టేషన్ అధికారులతో మాట్లాడే విధంగా ఏర్పాటు చేశారు. తద్వారా అధికారులను కేసు వివరాలను అడిగి తెలుసుకొని బాధితుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు.ప్రజల నుండి జిల్లా ఎస్పీ కార్యాలయానికి 48 ఫిర్యాదులను వచ్చాయి వాటిని సంబంధిత పోలీస్ అధికారులకు సమాచారం అందించి సకాలంలో విచారించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు వారికి సంబంధపడిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని ఆ ఫిర్యాదులను కూడా ప్రజా సమస్య పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణిస్తామని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు జిల్లా ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రావిమనోహర ఆచారి శాంతి భద్రతలు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన ఎలమంచిలి



**తిరుపతి విద్య డిసెంబర్ 2ప్రభాతవార్త:** అశోక ప్యాలెస్ హోటల్ నందు జరిగిన ఓ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ ఆర్ ఆర్ రెడ్డి ని బాలాజీ నర్సింగ్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం,ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి,రాష్ట్ర అధ్యక్షులు నందకిషోర్,ప్రధాన కార్యదర్శి శ్యామ్ బాబు, కార్యవర్గ సభ్యులు వర్ల మధుసూదన్,శ్రీకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బిల్లుల చెల్లింపులను మరింత సరళం



తిరుపతి విద్య డిసెంబర్ 2 ప్రభాతవార్త:, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ లిమిటెడ్ సంస్థ,విద్యుత్ బిల్లులు చెల్లింపులను మరింత సులభతరము చేయుటలో భాగంగా విద్యుత్ బిల్ చివరన క్యూ ఆర్ కోడ్ ని ప్రవేశపెట్టింది. తద్వారా త్వరితగతిన బిల్లులు చెల్లించే పద్ధతిని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చిందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి ఆంజనేయులు ఆపరేషన్ సబ్ డివిజన్ -1 తిరుపతి వారు పత్రికా ప్రకటన ద్వారా తెలియచేశారు.కావున వినియోగదారులందరు బిల్ చివరన ఇచ్చిన క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేసుకొని పేటియమ్,గూగుల్ పే,ఫోన్ పే వంటి ఆన్లైన్ ఆప్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.అంతే కాకుండా విద్యుత్ వినియోగదారులకు ఏదైని చిన్న విద్యుత్ సమస్య ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకు వస్తే సత్వర పరిష్కారము లభిస్తుందని కూడా తెలిపారు.

## ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



**తిరుపతి విద్య, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ అంతర వ్యవసాయ కళాశాలల క్రీడా,సాంస్కృతిక పోటీలు -2024లో తిరుపతి ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చాటారు. తిరుపతి, బాపట్ల, నైరా వ్యవసాయ కళాశాల ప్రాంగణాల్లో రాష్ట్రస్థాయిలో మూడు విడతల్లో క్రీడా పోటీలు నిర్వహించింది.ఇందులో వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థుల జట్టు బాస్కెట్ బాల్,టేబుల్ టెన్నిస్ విభాగాల్లో విజేతలుగా నిలిచింది. అంతేకాకుండా చెస్,లాంగ్ జంప్ లో రెండవ స్థానం,హై జంప్లో మూడో స్థానం దక్కించుకున్నారు.అలాగే ఫుట్ బాల్ విజేతగా,100 మీటర్ల పరుగు పందెంలో రెండవ స్థానంలో,200 వందల మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో,100 మీటర్ల రిలేలో మూడో స్థానంలో నిలిచారు.ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్వీ రమణ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్వీ చలం,వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ రవికాంత్ రెడ్డి,వాయామ అధ్యాపకురాలు జి.రాజేశ్వరి బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## వేలం పాటల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించండి



**రేణిగుంట, డిసెంబరు 2 ప్రభాతవార్త:** రేణిగుంట పంచాయతీకి సంబంధించిన వేలం పా టలు పారదర్శకంగా నిర్వహించాలంటూ ఎన్‌డీఏ కూటమి పార్టీలైన పలువురు టీడీపీ, జనసేన నేతలు సోమవారం డిమాండ్ చేశారు. బస్టాండ్ పార్కింగ్, వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, దుకాణాల వేలం పాటలు విస్తృతంగా బహిరంగపరచి వేలం వేయాలన్నారు. రేణిగుంట పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వేలం వేయాలని ఎట్టి పరిస్థితుల్లో నెల బాడుగులకు ఇవ్వకూడదన్నారు. వేలం పాటలు నిర్వహించడానికి 15 రోజులు ముందు నుంచే విషయాన్ని విస్తృతంగా బహిర్గత ప్రచారం చేయాలన్నారు. కార్యదర్శి మణికి వినతిపత్రం సమర్పించిన వారిలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, మాజీ ఉప సర్పంచ్ మునీర్ జీకే, రేణిగుంట టీడీపీ యువ నాయకులు వార్డు మెంబరు ఎం.జి.రెడ్డి, జనసేన నాయకులు నగరం భాస్కర్‌బాబు, టీడీపీ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు అప్రోజ్ తదితరులు ఉన్నారు.

## సమస్యలపై కమిషనర్‌ని టిడిపి నాయకులు



**నగరి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** గత 3,4 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరి మున్సిపల్ పరిధిలోని కొన్నిప్రదేశాలు రాజీవ్ నగర్, నగరిపేట, అమిత్‌నగర్, వినాయక నగరం, సాయినగర్, ఓంశక్తి ఎస్టీ నగర్, నగరి దళితవాడ, ఆదం కాలనీ, ఆనంద కాలనీ, కీళపట్టు బీసీ కాలనీ, ఏకాంబర కుప్పం, ప్రకాష్‌నగర్, కేవీఆర్ పేట, సత్రవాడ వినాయక నగర్, కీళపట్టు దళితవాడ, పుదుపేట, నత్తం కండ్రిగ మొదలగు ప్రదేశాల్లో వర్షపునీరు నిండి దోమలకు నిలయమై కొంత మంది డెంగ్యూ జ్వరాలకు లోనవుతున్నారని తెలిపారు కమిషనర్ అధికారులతో సమావేశమై ఈసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని అధికారులను తక్షణ చర్యలపై ఆదేశించారు.

## దివ్యాంగులకు నిత్యావసర సరకులు వితరణ



**నగరి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగలోని శిరీడ్స్ దివ్యాంగుల పాఠ శాల విద్యార్థులకు ప్రేరణశ్రీ ఎడ్యుకేషనల్, చారిట బుల్ ట్రస్టు వారు నిత్యావసర సరకులు, దుప్ప ట్లను వితరణగా అందించారు. సోమవారం పాఠశా లకు వెళ్లి ట్రస్టు ఫౌండర్ మోహనలక్ష్మి, ప్రొఫెసర్ ఇ.ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు సరకులు, దుప్పట్లు అందించారు. పాఠశాల నిర్వాహకులు ట్రస్టు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## నగరిపేటలో అంత్యక్రియలకు ఇబ్బందే

**నగరి, డిసెంబరు 2 ప్రభాతవార్త:** నగరి మున్సిపాలిటీ 1వ వార్డు నగరిపేటలో ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రాంతం నుంచి శ్మశనానికి వెళ్ళడానికి సరైన మార్గం లేదు. దీని వల్ల ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆ మార్గంపై నీరు నిలిచింది. కొన్ని చోట్ల మోకాల లోతు వరకు నిలిచింది. దీంతో ఆ నీటిలో దిగి ఇబ్బంది పడుతూనే మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేయాల్సి వచ్చిందని స్థానికులు వాపోతున్నారు.

# తిరుపతి డివిజన్

## 3 నెలలుగా జీతాలు ఇవ్వలేదు

### -పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించలేదు -విధులు బహిష్కరించిన గాంధీపురం పంచాయతీ సిబ్బంది



**తిరుపతిరూరల్,డిసెంబర్ 2 ప్రభాతవార్త:** 3 నెలలుగా జీతాలు ఇవ్వలేదు... ఎదైన అనారోగ్య సమస్య తలెత్తితే ఇఎస్ఐ వైద్య సౌకర్యం లేదు...మేము ఎలా జీవనం కొనసాగించాలంటూ గాంధీపురం గ్రామ పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేసారు. ఈ మేరకు సోమవారం విధులను బహిస్కరించి ధర్నాకు దిగారు. తిరుపతిరూరల్ గాంధీపురం గ్రామ పంచాయతీలో దాదాపు 40 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో ఓ పారిశుధ్య కార్మికురాలికి 150 బైపాస్ రోడ్డులో ప్రమాదం జరిగితే పట్టించుకోలేదని, స్వంత డబ్బు రూ.5వేల రుపాయాల వెచ్చించి బాగు చేసుకున్నట్లు చెప్పారు. పంచాయతీలో ఎప్పుడు కానరాని వ్యక్తులందరూ నేను టిడిపి గెలుపు కోసం పనిచేసాను...నేను ఎమ్మెల్యే అనుచరుణి అని గొప్పలు చెప్పుకుని అభివృద్దిని కుంటుపరుస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

## అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చెవిరెడ్డి

### -తుమ్మలగుంట నుంచి తిరుచానూరు వరకు ఆధ్యాత్మిక యాత్ర

**తిరుపతిరూరల్, డిసెంబర్2 ప్రభాతవార్త:** తిరుచా నూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్స వాలు పురస్కరించుకుని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం పట్టువస్త్రాలు సమర్పిం చారు. తుమ్మలగుంట శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తిరుచానూరు అమ్మవారి ఆలయం వరకు శోభయమానంగా ఆధ్యాత్మిక పాదయాత్రను నిర్వహించారు. వేదపాఠశాల పిల్లలతో పాటు అత్యధిక సంఖ్యలో అమ్మవారి భక్తులు తరలివచ్చి, చెవిరెడ్డి వెంట నడిచారు. తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి గాంధీపురం, అవిలాల, లింగేశ్వర్‌నగర్, సైర్‌నగర్, శ్రీనివాసపురం, పద్మావతిపురం మీదగా తిరుచానూరు వరకు శోభాయ మానంగా పాదయాత్ర ముగిసింది. శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాను అమ్మవారికి సమర్పించారు.

## అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన చెవిరెడ్డి



**తిరుచానూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** తిరుచానూరు పద్మావతి అమ్మవారికి చంద్రగిరి మాజీ ఎమ్ఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. తుమ్మలగుంట కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి పద్మావతి అమ్మవారికి ప్రతి సంవత్సరం గజవాహనం నాడు పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం మాజీ ఎమ్.ఎల్.ఏ తిరుచానూరులో తన అనుచరులు బంధు మిత్రులతో కలసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఇందులో భాగంగా తిరుచానూ రులో ఆ గ్రామ సర్పంచ్ రామచంద్రారెడ్డి మరియు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీధర్ రెడ్డిల ఆధ్వర్యంలో వైకాపా శ్రేణులు ఘనంగా స్వాగతం పలికి ఆయన వెంట అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్.పి.టి .సిశేఖర్, నరేష్‌రెడ్డి, వార్డు సభ్యులు చంద్రశేఖర్, ఆజాద్, మునేంద్ర రాయల్,వేమూరు యమ్.పి.టి.సి యోగానంద రెడ్డి, కార్యకర్తలు వెంకటేష్, లోకేష్, రాజ, హరి,హేమ. తదితరులు పాల్గొన్నారు.

## 7వ పేరెంట్ టీచర్స్ మీటింగ్



**పాకాల, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్ 7వ తేదీ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహిం చాలని ఆదేశించారన్నారు. కావున మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు.మండలంలోని ప్రధానోపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## నగరంలో కుక్కల స్వైర విహారం



**పాకాల, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** పాకాల నగరం, దామలచెరువు పరిసర గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నపిల్లలను పెద్దవారిని కొరికి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. కొన్ని కుక్కలకైతే శరీరంపై పెద్ద ఎత్తున పుండ్లు ఏర్పడి చీమురక్తం కారుతూ వీధులలో జనావాసలా మధ్య తిరుగుతు న్నా యి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దిం చి పాకాల మండలంలోని లైసెన్సు లేని వీధి కుక్కలను పట్టుకెళ్ళి జనావాసాలకు దూరంగా విడిచి పెట్టాలని మండల వాసులు అధికారులను కోరుతున్నారు.

## స్వచ్చభారత్ కార్మికులను ఎలా ఆగిపోమంటారు?



**నారాయణవనం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న సిబ్బంది వెంటనే ఆగిపోవాలంటూ అరణ్యంకండ్రిగ పంచాయతీ కార్యదర్శి హుకాం జారీ చేయడాన్ని మండల ఏఐటియుసి సంఘం నేతలు ఖండించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ చంద్రబాబు మాట్లాడుతూ అరణ్యంకండ్రిగ పంచాయతీలో సుమారు 5మంది పారిశుద్ధ్య కార్మికులు కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీలోని చెత్త మొత్తాన్ని తామే తొలిగిస్తున్నామని, అయితే సుమారు 30 నెలలుగా తమకు జీతాన్ని ప్రభుత్వం అందించపోయినప్పటికి విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్త పరిచారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోను పారిశుద్ధ్య కార్మికులు వున్నారని వారందరికి కూడా ప్రభుత్వం నుంచి జీతాలు విడుదల చేసే విధంగా మండల స్థాయి, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమానికి దిగడం ఖాయమన్నారు. అనంతరం ఇంచార్జీ ఎంపిడిఓ గుణశేఖర్‌కి వినతిపత్రం అందజేశారు.

## కైలాసనాధకోనలో తమిళ కార్తీక సోమవారం సందడే...

**నారాయణవనం, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** తమిళ కార్తీక మూడవ సోమ వారాన్ని పురష్కరించుకొని కైలాసనాధకోనకు వేలాదిమంది భక్తులు తరలివచ్చి కార్తీకస్నానాన్ని ఆచరించారు. కార్తీక మాసంలో చేసే పవిత్రస్నానాల వల్ల పుణ్యం లభిస్తుందని భావించే భక్తులు ఉదయం 3గ ంటల నుంచే కైలాసనాధకోనలోని జలపాత ంలో పవిత్రస్నానాన్ని చేయడానికి పోటీపడ్డారు. పవిత్రస్నానాన్ని ఆచరించిన తర్వాత చాలామంది భక్తులు అయ్యప్ప మాలను ధరించారు. అయితే గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో జలపాతంలో సందడి నెలకొంది.

## ఫెంగల్ తో తిరుపతిలో విద్యుత్‌శాఖకు...రూ.8.50లక్షలు నష్టం



**తిరుపతి(రవాణా),డిసెంబర్ 2ప్రభాతవార్త:** ఫెంగల్ తుఫాన్ కారణంగా మూడురోజులుగా కురిసిన భారీ వర్షాలకు తిరుపతి డివిజన్‌లో ఎస్‌పిడిసిఎల్‌కు 8.50లక్షల రూపాయలు ఆస్తి నష్టం సంభవించింది. తిరుపతి నగరంలో కరెంట్ స్తంబాలు, ట్రాన్స్ ఫార్మర్లు నేలకొరిగాయి. తీవ్ర నష్టంవాటిల్లినట్లు ఎస్‌డిసిఎల్ టౌన్ డిఇ వి.చంద్రశేఖరరావు తెలిపారు. చెట్లు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, సకాలంలో పునరుద్దరించినట్లు చెప్పారు. నగరంలో విద్యుత్ స్తంభాలు, 20 ట్రాన్స్ ఫార్మర్లు అగ్నిప్రమాదం జరిగి, 500 కండక్టర్ లైన్లు ధ్వంసమయ్యాయన్నారు. సోమవారం ఉదయం నగరం పరిసరాలు బిటిఆర్‌కాలనీ, మంగళ:, చైతన్య పురం, కృష్ణాపురం, పాతరేణిగుంట, కరకంబాడి, మామండూరు, గాజులమండ్యం ఎస్టేట్ ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని డిఇ చంద్రశేఖరరావు పరిశీలించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 82 అర్జీలు



**తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 2 ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో సకాలంలో అర్థవంతగా పరిష్కారం చూపాలని రీ ఓపెన్‌కు తావు లేకుండా అర్జీదారుని సంతృప్తి మేరకు పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా జాయింట్ కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. మొత్తం 82 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

**CHANGE OF NAME**

I,ERUVURI SISEENDRA (Old Name), R/at DNo: 5-75, Atthirala (V), Poli (P), Rajampeta (M) Annamayya Dist, A.P. I have Changed My name as ERUVURI SASIVARDHAN S/o ERUVURI SIDDAIAH (New Name)

# పంటల నమోదు ప్రక్రియ వేగవంతం చేయండి

చిట్టమూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త : ప్రస్తుత రబీ సీజన్‌లో ఆయా రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు అందరూ పంట నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని నాయుడుపేట ఎడి, చిట్టమూరు మండల వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్ తెలియజేశారు. సోమవారం చిట్టమూరు రైతు సేవా కేంద్రంలో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులతో సమావేశమైన ఆయన పంటల బీమా, ఈక్రాప్ నమోదు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరాల్లో రబీ సీజన్‌కు గాను రైతులు డిసెంబర్ 25వ తేదీలోగా నిర్దేశించిన పంటల ప్రీమియంను ఇన్సురెన్స్ సిబ్బందికి చెల్లించి రసీదు పొందాలని సూచించారు. పంటల



బీమాలో కౌలు రైతులు సైతం పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలో విస్తారంగా వరి పంట వేసిన రైతులు ఎకరాకు రూ.630 ప్రీమియం చెల్లిస్తే విపత్కర పరిస్థితుల్లో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.42 వేలు ఇన్సురెన్స్ కంపెనీ ద్వారా అందుతుందని తెలిపారు. అలాగే వేరుశనగ పంటకు రైతుల వాటాగా ఎకరాకు రూ.480 చెల్లిస్తే రూ.32 వేలు ఇన్సురెన్స్ అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు సునంద, దివ్యజ్యోతి, అరుణ, సంధ్య, సుధాకర్, పెంచలరత్నం, దినేష్, సర్ఫుద్దిన్, కరస్తూరయ్య ఉన్నారు.

## వీడని వర్షం.. నిండా మునిగిన అన్నదాత



కోట,డిసెంబర్ 2 ప్రబాతవార్త : గత నాలుగు రోజులగా వరునుడు కోట మండలంపై ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పెయింజల్ తుపాను ప్రభావం ప్రధానంగా రైతులను నిలువునా ముంచేసింది.రైతులు అప్పు సొప్పు చేసి వేసిన వరి నాట్లు, నారుముళ్లు మునకకు గురైయ్యాయి. మండలంలోని అల్లంపాడు, వంజివాక, కొత్త పాలెం, చెందోడు, తిన్నెలపూడి, ఊనుగుంట పాళెం, గూడలి, చిట్టేడు, రుద్రవరం తదితర గ్రామాల్లో వరినారుముళ్లు, నాట్లు పూర్తిగా మునిగి పోయ్యాయి. అల్లంపాడు గ్రామంలో 20 ఎకరాలు వరి నాట్లు మునిగితే వ్యవసాయాధిరులు ఇంత వరకు వచ్చి చూడలేదని ఉప సర్పంచ్ దేవరాల రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఊనుగుంటపాళెం గ్రామంలో మామిడి కాలువ ఉధృతకు అక్కడ వరి నాట్లు మునిగిపోయ్యాయి. మండలంలోని 43 చేరువులకుగాను 23 చెరువుల్లో పూర్తి స్థాయిలో నిండినట్లు నీటిపారుదశాఖ ఎఇ మునిరత్నం తెలిపారు.ఇంకా వర్షాలు కురుస్తుండటంతో వరి పాసిపోతొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**650 హెక్టార్లు వరి మునక:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కోట మండలంలో గత నాలుగురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన మామిడి కాలువ పొంగి వివిధ ప్రాంతాల్లో వరినాట్లు, వరి నారుమడులు మునిగిపోయినట్లు మండల వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో పర్యటించినట్లు పేర్కొన్నారు. 650 హెక్టార్లు వరి నాట్లు, 28 హెక్టార్లలో వరి నారుమడులు నీటి మునిగినట్లు తెలిపారు. వర్షాలు తగ్గిన అనంతరం నష్టంపై అంచనాలను ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తామన్నారు.

**ఉరకలేస్తున్న స్వర్ణముఖి నది:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కోట మండలం గూడలి వద్ద స్వర్ణముఖి నది, చల్లా కాలువలు ఉరకలేస్తున్నాయి. వరదప్రవాహం నెల్లూరుపల్లి కొత్తపాలెంలో పెన్నక్క చెరువుకు ప్రవహిస్తోంది. మరోపక్క చల్లా కాలువ నుంచి నేరుగా సముద్రంలోకి వరద నీరు చేరుతుంది. ఈ వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.

## దూదితో అయ్యప్ప స్వామికి ప్రత్యేక అలంకరణ



వెంకటగిరి, డిసెంబర్ 2 ప్రభాతవార్త : స్థానిక మల్లమ్మ గుడి వీధిలో కలిసి ఉన్న అయ్యప్ప స్వామికి ప్రత్యేకంగా దూదితో అలంకరించారు. సోమవారం సందర్భంగా అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అయ్యప్ప స్వామిని దూదితో అలంకరించడంతో భక్తులు ప్రత్యేకంగా తిలకించారు. అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు భజనలు నిర్వహించారు.

## నేదురుమల్లితో స్థానిక నాయకులు భేటీ



వాకాడు, డిసెంబర్ 2 ప్రభాతవార్త : వాకాడు లోని సోమవారం నేదురుమల్లి నివాసంలో కోట, వాకాడు వైకాపా స్థానిక నాయకులు రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ మాజీ చైర్మన్, వెంకటగిరి నియోజక వర్గ ఇన్చార్జి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డితో భేటీ అయ్యారు. పెంగల్ తుఫాను తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు వల్ల ప్రయోజనం గురించి మాట్లాడారు. స్థానిక నాయకులు పలు రాజకీయ సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు, ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసి చైర్మన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి, తూపిలి సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, వాకాడు ఉపసర్పంచ్ రాజశేఖర్ రెడ్డి,దేవా రెడ్డి నాగూర్ రెడ్డి, నెల్లూరు పెంచల్ రెడ్డి, భార్గవ్ రామ్, వాకాటి రవి కుమార్, గూడూరు వెంకటేశ్వర్లు రెడ్డి, గూడూరు సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## కాళంగి చుట్టూ పంట పొలాలు జలమయం



తడ, డిసెంబర్ 2 ప్రభాతవార్త : ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వలన తడ మండలంలోని పంట పొలాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. పులివేంద్ర, వాటంబేడుల సమీపంలో కాళంగి నది గట్లు తెంచుకొని పంట పొలాల వైపు మళ్లింది. కొండూరు, గ్రద్దగుంట, చేనిగుంట, తడకంద్రిగలతో పాటు వాటంబేడు, కారిజాత తదితర పంచాయతీల పరిధిలో కాళంగి వరద నీరు ప్రవహిస్తూనే ఉన్నాయి. ఆ ప్రాంతానికి అతి కష్టంమీద రైతులు చేరుకుంటున్నారు తప్ప అధికారులు వెళ్లడానికి కూడా ఇబ్బందిగా మారింది. మరోవైపు పాముల కాలువ, కరిపేట కాలువ సమీపాల్లోను పంట పొలాలకు వరద ప్రవాహం తగ్గలేదు. వర్షం ప్రభావం సోమవారం పెద్దగా కనిపించలేదు. తెరిపినివ్వడంతో రైతులు పంట పొలాల్లోకి వెళ్లి ఏ మేరకు మునిగిందో చూసుకుంటున్నారు.

## ఎమ్మెల్యే ఆదేశంతో అక్రమ కట్టడం కూల్చివేత

### -50 కోట్ల రూపాయల స్థలంను కాపాడిన ఎమ్మెల్యే



వెంకటగిరి, డిసెంబర్ 2 ప్రభాతవార్త : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశంతో అక్రమ కట్టడాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. 50 కోట్ల రూపాయల స్థలాన్ని అక్రమదారుల నుండి ఎమ్మెల్యే కాపాడారని పట్టణవాసులు హర్షిస్తున్నారు. పట్టణం సర్వే నంబర్201లో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. మున్సిపల్ సమావేశంలో అక్రమంగా భవనాన్ని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్నట్లు కౌన్సిలర్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అక్రమ కట్టడం కూల్చి వేయించడంతో ఎమ్మెల్యేకి పలువురు అభినందనలు తెలిపారు. పట్టణంలో కోట్ల రూపాయలు విలువైన స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

## అనుమానాస్పదంగా వృద్ధుడు మృతి!

నాయుడుపేటటౌన్, డిసంబరు 2 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని గాంధీమందిరం సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు అనుమానాస్పదంగా మృతిచెంది ఉండటాన్ని విఆర్ఓ హరిబాబు గుర్తించి సోమవారం పోలీసులకు పిర్యాదు చేశారు. విషయం తెలుసుకొన్న నాయుడుపేట సిఐ బాబి తనసిబ్బందితో కలిసి సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించారు.అనంతరం మృతదేహన్ని పంచనామా నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట సిఐ బాబి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గూడూరు డివిజన్

## ఎమ్మెల్యేచే బిసి గురుకుల పాఠశాలను ప్రారంభోత్సవం



గూడూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబు నాయుడు చొరవతో గురుకుల పాఠశాల ఏర్పాటు చేసామని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేటలో ఏర్పాటు చేసిన బిసి గురుకుల పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన వివరించారు. అలాగే గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గురుకుల పాఠశాలను మంజూరు చేయించామన్నారు. కోట ప్రాంతంలోని గురుకుల పాఠశాలను తీసేయాలని బావించారని, సిఎం చంద్రబాబుతో ఈ విషయాన్ని చర్చించి గూడూరులో గురుకులం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం గూడూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందాలని, సచివాలయ సిబ్బంది పేదలను ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, మస్తాన్ నాయుడు, రహీమ్, ఇశ్రాయిల్, కుమార్, అలీల్లహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



**రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే :**

గూడూరు పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, డిఎస్పి వివి రమణ కుమార్, పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖ అధికారులతో కలిసి అండర్ బ్రిడ్జి వద్ద వాహనాలు రాకపోకలను పరిశీలించారు. ప్రతి నిత్యం ట్రాఫిక్ స్థంబించడంతో వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని ప్రత్యామ్నాయం చూడాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం వెంకటరమణ సిఐలు శేఖర్ బాబు, శ్రీనివాసు ,ఎస్సై మనోజ్ కుమార్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి

కోట,డిసెంబర్ 2 ప్రభాతవార్త : గత ఎన్నికల ముందు ప్రజలను మభ్య పెట్టి గెలిచిన చంద్రబాబు నేడు ప్రజలకు అసలైన బాదుడంటే ఏంతో చూపిస్తున్నారని కోట మండల వైకాపా కన్వనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ వినియోగదారులపై విద్యుత్ చార్జీల సర్దుబాటు భారం మెపేందుకు సర్వం సిద్ధం చేశారని విమర్శించారు.ఇంధన చార్జీల కింద ప్రజల నుంచి వసూళ్లు చేసుకోవాలని డిస్కంలకు అనుమతిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలికి ఉత్వర్తులు జారీ చేశారని ఆరోపించారుఈ నెల నుంచి 2026 నవంబర్ వరకు అంటే దాదాపు రెండ్పే పాటు ఇంధన సర్దుబాటు కింద వినియోగదారులను నుంచి ముక్కుపిండి వసూళ్లు చేస్తారని పేర్కొన్నారు.

## గుంటల మయంగా గ్రామీణ రోడ్లు!

నాయుడుపేట టౌన్, డిసంబరు 2 ప్రభాతవార్త : ఫెంగల్ తుపాన్ ప్రభావంతో సూళ్ళూరుపేట నియోజకవర్గంలో గతనాలుగు రోజుల నుండి కురుస్తున్న భారీవర్షాల గ్రామీణరోడ్లు గుంటల మయంగా మారుతున్నాయి. ఈక్రమంలో నాయుడుపేట మండలంలోని జువ్వలపాళెం, కమ్మవారిపాళెం, పూడేరు, చిగురుపాడు తదితర గ్రామాలకు వెళ్ళె గ్రామీణరోడ్లు గుంటలుపడి రోడ్డురూపాన్ని కోల్పోతున్న సబందిత ర,భ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.ఈరోడ్లుపై అణునిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు అధికసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు-ప్రజాప్రతినిధులు స్పందించి గుంటలుపడిన గ్రామీణరోడ్లుకు శాశ్వత మర్మమతులు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## చదువులకు రాజనేని చారిటబుల్ ట్రస్టు చేయూత



చిల్లకూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త : చిల్లకూరు మండలం పాలిచర్లవారి పాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కోట గ్రామానికి చెందిన కురుగొండ్ల కరుణ అనే పేద విద్యార్థిని పైచదువుల నిమిత్తం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు ధాత్రుత్వంతో 20 వేల రూపాయలను ట్రస్టు సభ్యులు బాబు ద్వారా పాఠశాలలో అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులునాయుడు పేద ప్రజలకు సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల ప్రజెంధర్‌రెడ్డి, మాధవయ్య, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం నాయుడులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రధానం



గూడూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త : ఎస్‌కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలలో భాగంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శివప్రసాద్ బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. విజయ మహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పీర కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఝాన్సీ, వాణి, శైలజ, కిరణమై, శ్రీధర్ శర్మ, డా. నారాయణ రాజు, లక్ష్మి, మైమూన్, డా. సురేంద్ర, డా. కోటేశ్వర రావు, రవిరాజ, లక్ష్మి, హిమబిందు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు దివ్యంగుల ఆత్మీయ సమావేశం



గూడూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త : రీహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిసేబుల్(రెడ్) సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 3వ తేది ఉదయం గూడూరులోని షాదిమందిర్‌లో దివ్యంగుల ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరగుతుందని నిర్వాహకులు తెలిపారు.అలాగే దివ్యంగుల వివరాలను సంస్థ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతుందన్నారు. దివ్యాంగులు వారి దైవ్యంగుల దృవీకరణ పత్రం, ఆధార్,రేషన్ కార్డు జెరాక్సలు తెచ్చుకోవాల్సిందిగా కోరారు.

# వైభవంగా లక్ష్మి కాసులహారం శోభాయాత్ర

### గజ, గరుడ వాహనాల్లో అమ్మవారికి అలంకరణ



తిరుచానూరు, డిసెంబర్ 2 ప్రభాతవార్త: తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజైన గజ వాహనం సందర్భంగా తిరుమల నుండి లక్ష్మి కాసుల హారంను తీసుకుని వచ్చి పద్మావతి అమ్మవారికి అలంకారానికి వినియోగించడం ఆనవాయితి. ఈ సందర్భంగా సోమవారం ఉదయం లక్ష్మి కాసులహారం శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ముందుగా తిరుమల శ్రీవారి ఆలయం నుండి అదనపు ఈవో వెంకయ్య చౌదరి లక్ష్మి కాసుల హారాన్ని తిరుచానూరులోని శిల్పారామం పసుపుమండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్రగా మాడ వీధుల గుండా ఆలయానికి తీసుకుని వచ్చారు. ఈ హారాన్ని గజ మరియు గరుడ వాహన సేవలలో వినియోగిస్తారని తితిదే చైర్మన్ బిఆర్ నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఆలయ అర్చకులు బాబు స్వామి, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఏఈఓ దేవరాజులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



**అమ్మవారికి కానుకగా ఏడు గొడుగులు :**

తిరుచానూరు పద్మావతి అమ్మవారికి సోమవారం ఏడు గొడుగులు కానుకగా అందాయి. తమిళనాడు లోని తిరునిన్రవూరుకు చెందిన శ్రీమద్ రామానుజ కైంకర్య ట్రస్టు ప్రతినిధులు రెండు గొడుగులను కానుకగా అందించారు. ఈ గొడుగులను అమ్మవారి ఆలయం ఎదురుగా తితిదే చైర్మన్ బిఆర్. నాయుడుకు అందజేశారు. అదే విధంగా చెన్నైకి చెందిన హిందూ ధర్మార్థ సమితి అర్గనైజింగ్ కార్యదర్శి ఆర్ఆర్.గోపాల్ ఆధ్వర్యంలో 5 గొడుగులను ఆలయ ఎదుట డిప్యూటీ ఈవో గోవింద రాజన్‌కు అందించారు.

## వేడుకగా వసంతోత్సవం





తిరుచానూరు, డిసెంబర్ 2, ప్రభాతవార్త తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మ వారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో సోమవారం సాయంత్రం వసంతోత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వసంతోత్సవంలో భాగంగా చందనంతోపాటు పలురకాల సుగంధ పరిమళ ద్రవ్యాలతో అమ్మవారికి విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం చల్లదనం కోసం చందనం జలాన్ని మాడ వీధుల్లో భక్తులు ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, అర్చకులు ఉత్సాహంగా భక్తులపై వసంతాలు చల్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు,విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్థానికులకు దర్శన టోకెన్లు జారీ-వేకువజామున బారులుతీరిన భక్తులు



తిరుమల,డిసెంబర్ 2ప్రభాతవార్తప్రతినిధి: ఇష్టదైవం వేంకటేశ్వరస్వామి దర్శనభాగ్యం తిరుపతి,తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందినస్థానికులకు కల్పించడంతో దర్శన టోకెన్లు జారీసాఫీగా జరిగింది. టోకెన్లు అందుకున్న స్థానిక భక్తులు మంగళవారం (నేటి)ఉదయం తిరుమలలో దివ్యదర్శనం కాంప్లెక్స్ నుండి 8గంటలకు దర్శనానికి అనుమతినిస్తారు. అలాగే తిరుమలలో స్థానికులకు 500 ఉచిత దర్శన టోకెన్లు టిటిడి జారీచేసింది. తాజాగా సోమవారం వేకువజామున 3గంటలకు తిరుపతిలోని మహతి ఆడిటోరియం లోని ప్రత్యేక కౌంటర్లలో 2,500 ఉచిత దర్శన టోకెన్లు స్థానికులకు జారీ చేశారు. టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు, తిరుపతి ఎంఎల్ఎ శ్రీనివాసులు, చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తినాని, టిటిడి ఈఓ శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి టోకెన్లను లాంఛనంగా ప్రారంభించారు. తొలుత ఉచిత టోకెన్లను తిరుపతి రూరల్ మండలం గాంధీపురం, పేరూరు పంచాయతి వాసులకు వరుసగా మొదటి,రెండవ,మూడవ టోకెన్లు అందించారు.

## టిడిపి కార్యకర్తకు ఎంఎల్ఏ పులివర్తి నాని అండ

### -సిఎం సహాయనిధి నుండి రూ.10 లక్షలు సాయం



చంద్రగిరి, డిశంబర్ 2 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి ఎంఎల్ఏ పులివర్తి నాని అండగా నిలిచారు. స్థానిక విజయనగర్ కాలనీకి చెందిన కె.రవితేజ యాదవ్ టిడిపి కార్యకర్తగా పార్టీకి సుధీర్ఘ కాలంగా సేవలందిస్తున్నారు. గత కొన్నేళ్ళుగా రవితేజ యాదవ్ తల్లి కె.హైమవతి తీవ్ర అనారోగ్యంతో భాధపడుతూ వైద్య చికిత్సలు పొందుతున్నారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి తన సహాయనిధి నుండి రూ.10 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ మేరకు రూ.10 లక్షలు చెక్కు సోమవారం ఎంఎల్ఏ చేతుల మీదుగా రవితేజ అందుకున్నారు.ఎంఎల్ఏకి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి రుణపడి వుంటాననీ, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేస్తానని అన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 2 ప్రభాతవార్త : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 25 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుమారు 25 మంది వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు. అందులో ముఖ్యంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన టిడ్కో ఇండ్ల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్ నందు స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పిల్లలు ఆదుకునేందుకు ఇబ్బందిగా ఉందని, ఇకపై స్టాల్స్‌కు అనుమతి ఇవ్వొద్దని, టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, ఇండ్ల కోసం నగదు కట్టామని, ఇండ్లు ఇవ్వలేదని డబ్బులు తిరిగి ఇవ్వాలని, శ్రీవారి నగర్‌లో విద్యుత్ దీపాలు వెలగలేదన్నారు. ఆయా విభాగాల అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, రవి, సెక్రటరీ రాధిక, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ హాసిమ్, డి.ఈ.లు, ఏ.సి.పి.లు, సూపరింటెండెంట్లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అరబ్‌దేశాలకు విమానాలను నడపండి

### కేంద్ర మంత్రికి ఎంఎల్ఏ వినతి



శ్రీకాళహస్తి,డిసెంబర్ 2 ప్రభాతవార్త : రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, వైయస్ఆర్ జిల్లాల నుంచి చాలా మంది అరబ్‌దేశాలలో ఉద్యోగవకాశాల కోసం వెళుతున్నారు.వారి సౌకర్యార్థం తిరుపతి విమానాశ్రయం నుంచి విమానాలు నడపాలని స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కేంద్ర పౌర విమానశాఖ మంత్రికి విన్నవించినట్లు సోమవారం మీడియాకు తెలిపారు. తిరుపతి విమానాశ్రయం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉండటం విమానాశ్రయం చుట్టూ పరిశ్రమలు వెలువడ్డాయన్నారు. అలాగే కేంద్ర ఉన్నత విద్యాసంస్థలు ఐఐటి,ఐసర్ ఇక్కడ ఉన్నాయని వివరించారు. కాబట్టి తిరుపతి విమానాశ్రయానికి ఎంతో ప్రాధాన్యత ఉందని సుధీర్‌రెడ్డి వివరించారు. తిరుపతి విమానాశ్రయం నుంచి గతంలో తాను చేసిన అభ్యర్థన మేరకు ముంబాయికి ఉదయం సాయంత్రం నడపుటకు అనుమతించటాన్ని ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా అరబ్ దేశాల్లోని వ్యాపార కేంద్రాలుగా ఉన్న ఖతర్,దుబాయ్‌తోపాటు ఆధ్యాత్మిక చింతనకు ప్రపంచ దేశాల్లోనే పేరెన్నిక గన్న మక్కా, మదీనాలకు కూడా అవకాశాలను కల్పించాలని కోరినట్లు వివరించారు. ఇందుకు సానూకూలంగా స్పందించిన మంత్రి రామమోహన్ నాయుడు జనవరి నుంచి అరబ్‌దేశాలకు విమానాలు నడపటానికి భరోసా ఇవ్వటం అభినందనీయం అన్నారు.

## కలెక్టర్ సారూ..మా బాధలు పట్టించుకోరా!

### -కార్యాలయంలో గొడుగులేసుకుని పనులు..



తొట్టంబేడు, డిసెంబర్ 2 ప్రభాతవార్త : కలెక్టర్ సారూ..తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న సర్వేయర్‌గది అధ్వాన్నంగా మారింది. ఎప్పుడు కుప్పకూలుతుందో అని సిబ్బంది భయబ్రాంతులకు గురవుతున్నాయి. పురాతన భవనం కావడంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న ఫెంగాన్ తుఫాను వల్ల కురిసిన వర్షాలకు కార్యాలయం మొత్తం ఉరుస్తోంది. రికార్డులు తడవకుండా ఉండకుండా ఉండేందుకు పట్టలు తెప్పించి కప్పడంతోపాటు కార్యాలయంలోనే గొడుగులు వేసుకుని పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓవైపు తహశీల్దార్ కార్యాలయం కూడా ఉరిసేందుకు సిద్ధమవుతోంది. ఇక రికార్డులు కార్యాలయాన్ని పరిశీలిస్తే గతంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా ఉన్న సుధీర్‌రెడ్డి బాగుచేయించడంతో ఈ కార్యాలయం ఒక్కటి మాత్రమే ఉరుపులేకఉండా ఉంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో కార్యాలయంలో ఇదే పరిస్థితి.